ఆదివారం
గత వారంలోని పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

అన్నమయ్య

కాక్రోచ్ పార్టీకి పోటీగా 'ఇష్క్ కరో' పార్టీ

హెచ్-1బి వీసా ఫీజును రద్దుచేసిన బోస్టన్ కోర్టు

5లో

: fb.com/vaartha Digital

Published from Annamayya Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

10-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 130 పేజీలు: 10+4 వెల: 6.50

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో

# ఎన్నడూ చూడని విషాదం

### మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, ఉద్యోగం: డి.సిఎం పవన్ కల్యాణ్



మంగళవారం విశాఖలో మీడియాతో డి.సిఎం పవన్

**విశాఖపట్నం, జూన్9, ప్రభాతవార్త :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర పారిశ్రామిక ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడడం రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించనున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఉదయం ప్రమాదం జరిగిన స్టీల్ మెల్టింగ్ షాప్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. గాయపడిన వారి వైద్య ఖర్చులన్నింటినీ ప్లాంట్ యాజమాన్యమే భరిస్తుందని స్పష్టం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన శాశ్వత ఉద్యోగుల కుటుంబాలకు పదవీ విరమణ ప్రయోజనాల కింద సుమారు రూ.1.72 కోట్లు, >>7



ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి లోకేష్

### బాధితులను పూర్తిగా

## ఆదుకొంటాం

### మంత్రి లోకేష్ హామీ, విశాఖ చేరిన ముగ్గురు సభ్యుల కమిటీ

**విశాఖపట్నం, జూన్ 9 ప్రభాతవార్త :** విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.. కేజీహెచ్ మార్చురీవద్ద మృతుల కుటుంబాలను, వివిధ ఆసుపత్రుల్లో >>7



మంగళవారం ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రతి రోజు మంచినీటి శాంపిల్లు తీయాలి

రూరల్ అన్న క్యాంటీన్లు సమర్థంగా నిర్వహించాలి

ఆర్టీజీఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

### ఆన్‌లైన్ ప్రభుత్వ సేవలకు

# ప్రత్యేక యాప్

**విజయవాడ,జూన్ 9, ప్రభాతవార్తప్రతినిధి:** మన మిత్ర ద్వారా ప్రభుత్వ సేవలన్నింటినీ ఆన్ లైన్‌లో వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని.. దీంతో పాటు ప్రత్యేకంగా ఓ యాప్ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, క్షేత్ర స్థాయిలో వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షి ం చారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రభుత్వం అందించే అన్ని సేవలను ఆన్ లైన్ చేశాం. మన మిత్ర వాట్సాప్ ద్వారా ఆన్ లైన్లో ప్రభుత్వ సేవలను వినియోగించుకునేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇదే సందర్భంలో ఆన్ లైన్లో ప్రభుత్వ సేవలను వినియోగించుకునేలా యాప్ రూపొందించాలి. రాష్ట్రంలోని అన్న క్యాంటీ న్లను పూర్తి స్థాయిలో సమర్థవంతంగా >>7

## నెహ్రూను దాటేసిన 'పుష్కర మోడీ'



### పన్నెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న ఎన్డీయే

### నేడు కేబినెట్ భేటీలో ప్రధానికి ఘనసత్కారం

**న్యూఢిల్లీ,జూన్ 9:** కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమి 12 ఏళ్ల అధికారం పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బుధ, గురు వారాల్లో ఎన్డీయే పక్షాల కీలక భేటీ జరగనున్నది. 12 ఏళ్ల పూర్తైన సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకోవడంతోపాటు, భవిష్యత్‌లో ఎలా కలిసి ముందుకు వెళ్లాలి అనే అంశాలపై ఈ భేటీ జరగనుంది. ఇప్పటికే ఎన్డీయేకు చెందిన నేతలు సమావేశం కోసం ఢిల్లీ చేరుకున్నారు. ఇక గురువారం ప్రధాని మోడీ ఎన్డీయే పాలిత రాష్ట్రాల సిఎంలు, డిప్యూటీ సిఎంలతో కూడా భేటీ కానున్నారు. తమ పాలన ఉన్న రాష్ట్రాల్లో వికసిత్ భారత్ కోసం ఎలా పని చేయాలి, పశ్చిమాసియా సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలపై మోడీ వారితో చర్చించే అవకాశం ఉంది. ఎన్డీయే పాలనలోకి వచ్చి 12 ఏళ్లపూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధానిమోడీ సోషల్ మీడియాలో పోస్టుచేస్తూ 12 యేళ్లలో దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. దశాబ్దాలపాటు నిరాదరణకు గురైనవారికి అభివృద్ధి ఫలాలను చేరవేయడంపైనే తమ సర్కారు దృష్టిపెడుతుందన్నారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలుచేపట్టి రెండేళ్లయిన నేపథ్యంలోసోమవారం ఆయన సోషల్‌మీడియాలో పోస్టుపెట్టారు. తమ ప్రభుత్వం తెచ్చిన ప్రత్యక్ష నగదు బదిలీ, స్వచ్ఛభారత్, పిఎం ఆవాస్‌యోజన ఆయుష్మాన్‌భారత్ వంటిపథకాలు ప్రత్యేకించి ప్రస్తావించారు. ప్రజలకు అవకాశాలు గౌరవం కల్పించడమే లక్ష్యంగా వాటిని >>7

# ఆక్వాకు అగ్రప్రాధాన్యం

### ఫీడ్ ధరలపై రైతులు, తయారీదారులు పరస్పర అంగీకారంతో ముందుకు రావాలి

### ఆక్వా విద్యుత్ కనెక్షన్లు యూనిట్‌కు రూ. 1.50 రాయితీ: మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ, జూన్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, సముద్ర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు తదితర రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదలపై రైతులు, పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయని మంత్రి తెలిపారు. ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు అధికమయ్యాయని తయారీ సంస్థలు వివరించగా, ఇప్పటికే ఖర్చుల భారంపెరిగిన నేపథ్యంలో ధరల పెంపును నియంత్రించాలని రైతులు కోరినట్లు చెప్పారు. ఆక్వాకల్చర్ రంగ సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఫీడ్ ధరల నిర్ణయంలో శాస్త్రీయ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు మంత్రి వెల్లడించారు. ముడి పదార్థాలధరలు, టోకు ధరలసూచీతో పాటు మార్కెట్ పరిస్థితులను పరిగణన లోకి తీసుకుని భవిష్యత్తులో పారదర్శక ధరల వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. ఆక్వాకల్చర్ రైతులకు విద్యుత్ రాయితీపై మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ అందించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు.

ఉత్తర్వులు జారీ అయిన తర్వాత అర్హత కలిగిన అన్ని ఆక్వాకల్చర్ కనెక్షన్లు అవి చిన్న, పెద్ద ఫారాలు అయినా, ఆక్వా జోన్ లేదా నాన్‌ఆక్వా జోన్‌లో ఉన్నా ఈ పథకం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు రైతు లకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందనితెలిపారు. మత్స్య, ఆక్వా కల్చర్ రంగాల్లో స్థిరమైన అభివృద్ధి, పోటీతత్వ సామర్థ్యాల పెంపు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పునరు ద్ఘాటించారు.

### నాలుగు రాజ్యసభ నామినేషన్లు సక్రమమే

#### - రిటర్నింగ్ అధికారి వనితా రాణి

**విజయవాడ, జూన్ 9, ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యసభ ఎంపి ఎన్నికలకు సంబంధించి నలుగురు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనితా రాణి వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. రాజ్యసభ ఎంపి అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరుపున చింతకాయల విజయ్, బాష్యం రామకృష్ణ, సానా సతీష్, జనసేన పార్టీ తరపున లింగమనేని రమేష్‌లు దాఖలు చేసిన నామినేష్లను సమక్రమంగా ఉండడంతో పరిశీలన అనంతరం నలుగురు అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించినట్టు ఆమె వెల్లడించారు. నాలుగు రాజ్యసభ స్థానాలకు నలుగురు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. ఈ నామినేషన్ల పరిశీలనలో ఆయా అభ్యర్థుల తరుపున వారి ప్రతినిధులు పాల్గొన్నారు.



మంగళవారం ప్రధాని మోడీ ప్రభుత్వంపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

### పునరుత్పాదక ఇంధనంలో

# భారత్ టాప్

### 290 గిగావాట్ల స్థాపిత సామర్థ్యంతో అమెరికాను దాటిన వైనం

### సౌరశక్తి, పవనశక్తిలో 3,4 స్థానాలు: కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

**తిరుపతి,జూన్ 9ప్రభాతవార్తప్రతినిధి:** పునరుత్పాదక ఇంధన రంగంలో 290 గిగావాట్ల స్థాపిత సామర్థ్యంతో భారత్ అమెరికాను అధిగమించిందని, సౌరశక్తి పవనశక్తి రంగాల్లో ప్రపంచంలో వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో భారత్ నిలిచిందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయంగా అభివృద్ధి చెందిందని, మౌలిక సదుపాయాల అభివృద్ధిద్వారా భారీ పెట్టుబడులు, యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. గత 11 సంవత్సరాల్లో 60 వేల కిలోమీటర్లకు పైగా కొత్తరహదారులు, హైస్పీడ్ కారిడార్లు నిర్మించామని వెల్లడించారు. సెమీకాన్ ఇండియా కార్యక్రమం ద్వారా 1.69 >>7



మంగళవారం కర్నూలులో రాస్తా రోకో చేస్తున్న వామపక్షాలు

### పెట్రోలు, డీజిల్ ధరల పెంపుపై

## కదంతొక్కిన వామపక్షాలు

### రాష్ట్ర వ్యాప్తంగా భారీ రాస్తారోకోలు

**విజయవాడ,జూన్9,ప్రభాతవార్తప్రతినిధి:** పెట్రోల్, డీజిల్ గ్యాస్‌ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఎం పిలుపుమేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర రోకో నిర్వహించారు. పలు జిల్లాల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోడీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో ప్రజలపై అనేక భారాలు మోపిందని, తక్షణమే భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ రాణిగారితోట, నేతాజీవంతెన జంక్షన్ జాతీయరహదారిపై మంగళ వారం సిపిఎం, సిపిఐ, ఇతర >>7

### మౌలిక వసతుల కల్పనకు

# భారీ ప్రణాళికలు

### డ్రైనేజి వ్యవస్థ ఆధునీకరణకు రూ. 29 వేల కోట్లు

### ప్రజాధనం వృధాకానివ్వొద్దు: మంత్రి నారాయణ



మంగళవారం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ రెండు రోజుల వర్క్‌షాపును జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

**విజయవాడ,జూన్9, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. స్థానిక మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో హడ్కో ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ రెండు రోజుల వర్క్ షాపులో భాగంగా తొలి రోజు వర్క్ షాపును పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి పి.నారాయణ మాట్లాడుతూరాబోయే మూడేళ్లలో ప్రజల ప్రాథమిక అవసరాలైన ఐదు ప్రధాన అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన మంచినీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, వాడుక నీటి నిర్వహణ, అంతర్గత రోడ్ల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. హడ్కో దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా >>7

### మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కృతి

**భోపాల్,జూన్ 9:** రాజ్యసభ ఎన్నికలపై ఉత్కంఠ పెరుగుతోంది. ఈ నెల 18వ తేదీ జరిగే ఎన్నికల్లో గెలిస్తే రాజ్యసభలో మూడింటి రెండొంతుల మెజార్టీ సాధించే అవకాశం ఉండటంతో బిజెపి వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఇదే క్రమంలో మధ్యప్రదేశ్ నుంచి పోటీకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్‌ను ఓడించేందుకు ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేస్తుండటంతో వారంతా బెంగళూరు క్యాంప్‌కు తరలివెళ్లారు. అయితే ఆ తర్వాత కూడా మీనాక్షి నటరాజన్‌కు షాక్ తప్పలేదు. మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ సమర్పించిన నామినేషన్ అఫిడవిట్‌లో ఆమె తెలంగాణలో నమోదైన ఓ క్రిమినల్ కేసుకు సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టినట్లు నిర్ధారించి ఎన్నికల అధికారులు దాన్ని తిరస్కరించారు. నటరాజన్ అభ్యర్థిత్వాన్ని >>7

## Format C-7

(for political parties to publish in the newspapers, social media platforms & website of the party)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates

(As per the Commission's directions issued in pursuance of the Order dated 13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petition(C) no. 2192 of 2018 in WP(C) no. 536 of 2011)

Name of Political Party : **TELUGU DESAM PARTY**
*Name of the Election : **BIENNIAL ELECTIONS TO COUNCIL OF STATES (RAJYA SABHA) 2026**
Name of State/UT: **ANDHRA PRADESH**

(1) Name of the Constituency - **Council of States (Rajya Sabha)**
Name of the candidate - **Vijay Chintakayala**

| Sl. No | | | |
|---|---|---|---|
| 1. | Criminal antecedents | | |
| | a. | Nature of the offences | 1. U/s Sec. 419, 469, 153(A) and 505(2), 120-B/ r/w.34 IPC and Sec.66-C of IT Act-2000.<br>Allegation is that there is a post in social media harming the reputation of a person.<br><br>2. U/S Sec. 66(C) IT Act 2000 and 465,469,471,153 (A), 505(2) r/w 120-B IPC<br>Allegation is that created a fake and morphed video and the same was circulated in social media and conspired to promote enmity between different groups on the basis of caste by spreading rumour/alarming news and there by create communal disharmony among the public.<br><br>3. U/S Sec. 324, 506 r/w, 34 IPC<br>Allegation is that the complainant lodged a report stating that in a village festival, the accused persons made altercation with De-facto complainant and beat him on 16th April, 2022.<br><br>4. U/S Sec. 188, 353, 153a, 505, 504, 269, 270 r/w, 34 IPC, 3 PA-1922, 3 EDA 1897, 51 (b) DMA-2005,30 PA-1861<br>Allegation is that while police officers were on bandobust duty, the accused persons conducted dharna on the road without following COVID norms and obstructed the police from discharging their duties by using insulting words and created fear to the public and disobeyed the orders promulgated by the police.<br><br>5. U/S Sec. 341, 186 r/w, 34 IPC<br>Allegation is that during municipal elections, the accused persons given loud slogans against distribution of cash in mobile dispensing unit by using loud speakers and obstructed the vehicle moments of Municipal Commissioner and Assistant Election Authority and thereby obstructed election related works.<br><br>6. U/S Sec. 448, 341, 509, 506 r/w, 109 IPC<br>Allegation is that the while De-Facto complainant was trying to erect YSRCP party flag on the top of their house, Rajana Harsha and others trespassed in to top of their house and restrained him and obstructed to not to launch the YSR flag and also scolded in filthy language and threatened him and his family with dire consequences. |
| | b | Case no. | 1. FIR No. 14/2022 of CCPS, CBCID Police Station, Mangalagiri, Guntur District<br>2. FIR No. 12/2022 of CCPS, CBCID Police Station, Mangalagiri, Guntur District.<br>3. FIR No. 81/2022, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural<br>4. FIR No. 293/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhaptnam Rural.<br>5. FIR No. 83/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural<br>6. FIR No. 528/2019, Narsipatnam Town Police Station, Visakhapatnam Rural. |
| | c | Name of the Court | Not Applicable |
| | d | Whether charges have been framed or not (Yes/No) | No |
| | e | Date of conviction, if any | Not Applicable |
| | f | Details of punishment undergone, if any | Not Applicable |
| | g | Any other information required to be given | NIL |
| 2. | The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words) | | He has been actively involved in social service activities and has been great supporter of the marginalized sections of the society. |
| 3 | Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words) | | No other suitable candidate was available. |

(2) Name of the Constituency- **Council of States (Rajya Sabha)**
Name of the candidate- **Chintakayala Vijay** and so on

* In the case of election to Council of States or States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of Constituency.

**Signature of office bearer of the Political Party**
**Name and designation**
**P. Ashok Babu**
**State General Secretary, TDP**

### 18, 19 తేదీల్లో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సమీక్షలు

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రజా రంగ సంస్థల కమిటీ(సిపియు) సమావేశాలు 18,19 తేదీలలో అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యాలయ కమిటీ హాల్-1లో నిర్వహించనున్నట్లు శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ సమావేశంలో సంబంధిత అథారిటీలు, కార్పొరేషన్ల స్థాపన లక్ష్యాలు, ఆర్థిక పరిస్థితి, ఆస్తులు-అప్పులు, సంస్థల కార్యకలాపాలు, సాధించిన విజయాలు, సిబ్బంది వివరాలు, ఖాళీలు, రోస్టర్ అమలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే ప్రభుత్వ విధానాల అమలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రైవేట్ భాగస్వామ్య విధానాలు, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ, ఖాతాల నిర్వహణ, ఆడిట్ అభ్యంతరాల పరిష్కారం, పనితీరు, సామర్థ్య పెంపు చర్యలు, ఈఆఫీస్ అమలు పరిస్థితులపై కూడా కమిటీ పరిశీలన చేయనుంది. 18న వ్యవసాయం, పట్టు పరిశ్రమ, సహకార రంగం, రైతు సంక్షేమం, పశుసంవర్ధక, మత్స్య, వెటర్నరీ, సామాజిక సంక్షేమ రంగాలకు సంబంధించిన సంస్థలను సమీక్షించనున్నారు. వీటిలో ఎపి స్టేట్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ, రైతు సాధికార సంస్థ, స్టేట్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ అండ్ ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఎపి స్టేట్ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్, మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఎపి స్టేట్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్, ఎపి వెటర్నరీ కౌన్సిల్, ఎపి పారా వెటర్నరీ అండ్ అలైడ్ కౌన్సిల్ వంటి సంస్థలు ఉన్నాయి. 19న ఎపి కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్, ఎంజెపి ఎపిబిసిడబ్ల్యూ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఎపి స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్, ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎపి మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆర్థిక, పరిపాలనా అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు.

## Format C-1

(for candidate to publish in Newspaper, TV)

**Declaration about criminal cases**

(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & ORS. Vs. Union of India & Anr.)

Name and address of candidate: **VIJAY CHINTAKAYALA &**
D. No.14-40/2, Velama Veedhi, Narsipatnam, Anakapalli District, Andhra Pradesh - 531116.
Name of the political party : **TELUGU DESAM PARTY**
(Independent candidates should write "Independent" here)
Name of the Election: **ELECTION TO THE COUNCIL OF STATES (RAJYA SABHA)**
* Name of the constituency: **ANDHRA PRADESH (STATE)**

I **VIJAY CHINTAKAYALA** (name of candidate), a candidate for the above-mentioned election; declare for public information the following details about my criminal antecedents:

**(A) Pending criminal cases**

| Sl. No | Name of Court | Case No. and dated | Status of case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | NOT APPLIC ABLE | FIR No. 14/2022 of CCPS, CBCID Police Station, Mangalgiri, Guntur District, AP Dated. 01-10-2022 | The FIR is under investiga tion | U/S Sec. 419, 469, 153(A) and 505(2), 120-B/ r/w.34 IPC and Sec.66-C of IT Act-2000 & Allegation is that there is a post in social media harming the reputation of Wife of Smt. Y.S.Bharathi Reddy, w/o Jagan Mohan Reddy. |
| 2 | NOT APPLIC ABLE | FIR No.12/2022 of CCPS, CBCID Police Station, Mangalagiri, Guntur District, AP Dated. 05-09-2022 | The FIR is under the stage of investiga tion | U/S Sec. 66(C) IT Act 2000 and 465, 469, 471, 153(A), 505(2) r/w 120-B IPC & Allegation is that created a fake and morphed video of Shri Kuruva Gorantla Madhav and the same was circulated in social media and conspired to promote enmity between different groups on the basis of caste by spreading rumour / alarming news and there by create communai disharmony among the public. |
| 3 | NOT APPLIC ABLE | FIR No. 81/2022, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural. Dated. 17-04-2022 | The FIR is under investiga tion | U/S Sec. 324, 506 r/w, 34 IPC & Allegation is that the complainant lodged a report stating that in a village festival, the accused persons made altercation with De-facto complainant and bet him on 16th April, 2022. |
| 4 | NOT APPLIC ABLE | FIR No. 293/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural Dated. 24-11-2021 | The FIR is under investiga tion | U/S Sec. 188, 353, 153a, 505, 504, 269, 270 r/w, 34 IPC, 3 PA-1922, 3 EDA 1897, 51 (b) DMA-2005,30 PA-1861 & Allegation is that while police officers were on bandobust duty, the accused persons conducted dharna on the road without following covid norms and obstructed the police from discharging their duties by using insulting words and created fear to the public and disobeyed the orders promulgated by the police. |
| 5 | NOT APPLIC ABLE | FIR No. 83/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural Dated. 07-03-2021 | The FIR is under investiga tion | U/S Sec. 341, 186 r/w, 34 IPC & Allegation is that during municipal elections, the accused persons given loud slogans against distribution of cash in MDU Rice vehicles by using loud speakers and obstructed the vehicle moments of Municipal Commissioner and Assistant Election Authority and thereby obstructed election related works. |
| 6 | NOT APPLIC ABLE | FIR No. 528/2019, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural. Dated. 12-12-2019 | The FIR is under investiga tion | U/S Sec. 448, 341, 509, 506 r/w, 109 IPC & Allegation is that the while De-Facto complainant was trying to erect YSRCP party flag on the top of their house, Rajana Harsha and others trespassed in to top of their house and restrained him and obstructed to not to launch the YSR flag and also scolded in filthy language and threatened him and his family with dire consequences. |

**(B) Details about cases of conviction for criminal offences**

| Sl. No | Name of court & date (s) of orders (s) | Description of offence (s) & punishment imposed | | Maximum Punishment Imposed |
|---|---|---|---|---|
| 1 | NOT APPLIC ABLE | NOT APPLICABLE | NOT APPLIC ABLE | NOT APPLICABLE |
| 2 | NOT APPLIC ABLE | NOT APPLICABLE | NOT APPLIC ABLE | NOT APPLICABLE |
| 3 | NOT APPLIC ABLE | NOT APPLICABLE | NOT APPLIC ABLE | NOT APPLICABLE |

- In the case of election to Council of States or election to Legislative Councils by MLAs, mention the election concerned in place of name of constituency.

**Sd/- Vijay Chintakayala**

# Format C-2

**(for political party to publish website, newspapers, TV)**

**Declaration about criminal antecedents of candidates set up by the party**

*(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)*

Name of political party : **TELUGU DESAM PARTY**

Name of Election : **BIENNIAL ELECTIONS TO COUNCIL OF STATES (RAJYA SABHA) 2026**

Name of State/ UT : **ANDHRA PRADESH**

| 1 | 2 | 3 | 4 | | 5 | | |
|---|---|---|---|---|---|---|---|
| Sl. No | Name of constituency | Name of candidate | (A) Pending criminal cases | | (B) Details about cases of conviction for criminal offences | | |
| | | | Name of Court, case No. & status of the case(s) | Section of the Acts concerned & brief description of offence(s) | Name of Court & date (s) of order(s) | Description of offence (s) & punishment imposed | Maximum Punishment Imposed. |
| | Council of States (Rajya Sabha) | Vijay Chintakayala | | | | | |
| 1 | Council of States (Rajya Sabha) | Vijay Chintakayala | FIR No. 14/2022 of CCPS, CBCID Police Station, Mangalagiri, Guntur District Chargesheet not filed. | U/s Sec. 419, 469, 153(A) and 505(2), 120-B/ r/w.34 IPC and Sec.66-C of IT Act-2000. Allegation is that there is a post in social media harming the reputation of a person. | Not Applicable | Not Applicable | Not Applicable |
| 2 | | | FIR No. 12/2022 of CCPS, CBCID Police Station, Mangalagiri, Guntur District. Chargesheet not filed | U/S Sec. 66(C) IT Act 2000 and 465,469,471,153 (A), 505(2) r/w 120-B IPC Allegation is that created a fake and morphed video and the same was circulated in social media and conspired to promote enmity between different groups on the basis of caste by spreading rumour /alarming news and there by create communal disharmony among the public. | | | |
| 3 | | | FIR No. 81/2022, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural Chargesheet not filed | U/S Sec. 324, 506 r/w, 34 IPC Allegation is that the complainant lodged a report stating that in a village festival, the accused persons made altercation with De-facto complainant and beat him on 16th April, 2022. | | | |
| 4 | | | FIR No. 293/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhaptnam Rural. Chargesheet not filed | U/S Sec. 188, 353, 153a, 505, 504, 269, 270 r/w, 34 IPC, 3 PA-1922, 3 EDA 1897, 51 (b) DMA-2005,30 PA-1861 Allegation is that while police officers were on bandobust duty, the accused persons conducted dharna on the road without following COVID norms and obstructed the police from discharging their duties by using insulting words and created fear to the public and disobeyed the orders promulgated by the police. | | | |
| 5 | | | FIR No. 83/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural Chargesheet not filed | U/S Sec. 341, 186 r/w, 34 IPC Allegation is that during municipal elections, the accused persons given loud slogans against distribution of cash in mobile dispensing unit by using loud speakers and obstructed the vehicle moments of Municipal Commissioner and Assistant Election Authority and thereby obstructed election related works. | | | |
| 6 | | | FIR No. 528/2019, Narsipatnam Town Police Station, Visakhapatnam Rural. Charge sheet not filed | U/S Sec. 448, 341, 509, 506 r/w, 109 IPC Allegation is that the while De-Facto complainant was trying to erect YSRCP party flag on the top of their house, Rajana Harsha and others trespassed in to top of their house and restrained him and obstructed to not to launch the YSR flag and also scolded in filthy language and threatened him and his family with dire consequences. | | | |

**Signature of office bearer of the Political Party**
**Name and designation**
**P. Ashok Babu**
**State General Secretary, TDP**

**పారిశ్రామిక వికాసమే కీలక దిశ... విధ్వంసానికి స్వస్తి, విశ్వవిఖ్యాతమవుతున్న ఎపి ఖ్యాతి**

# ఎపి ఈజ్ బ్యాక్

## దేశవ్యాప్త చర్చగా మారిన నాయుడు గిరీ

- రాష్ట్రానికి వరదలా పెట్టుబడులు
- చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎంఓయూల ఛేజింగ్.
- రెండేళ్లలో పెట్టుబడులు పెట్టడానికి 800 కంపెనీల ఆసక్తి
- పెట్టుబడుల సాకారానికి నిత్యం కేంద్రంతో సంప్రదింపులు
- ఎంఓయూల అమలుకు నోడల్ అధికారులు
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో మారుతోన్న ఎపి ముఖ చిత్రం
- ఎంఒయుల అమలును పర్యవేక్షిస్తోన్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్



సిఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన ఓ పారిశ్రామిక ఒప్పందం (ఫైల్)

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రం శరవేగంగా మారుతోంది. రెండేళ్లల్లో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి సీఎం చంద్రబాబు పారిశ్రామిక విధానంలో తన స్టైల్ మార్చారు. గతానికి భిన్నంగా వెళ్లడం మొదలు పెట్టారు. 201419 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అవలంభించింది. ఆ స్పీడుతోనే నాడు కొన్ని కీలక పెట్టుబడులు తెచ్చింది. కియా కార్ల కంపెనీని తెచ్చి ఉమ్మడి అనంతపురం జిల్లా.. ప్రత్యేకించి పెనుకొండ ప్రాంతం రూపు రేఖలు మార్చింది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. దీంట్లో భాగంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. భారీ స్థాయిలో ఎంఓయూలు కుదుర్చు కున్నారు. గత రెండేళ్ల కాలంలో సుమారు 800 కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని కనబరిచాయి. ప్రస్తుతం రెండేళ్ల కాలంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ఆసక్తి కనబరిస్తే.. వీటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. వీటిల్లో రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు వివిధ ఎంఓయూల ద్వారానే వస్తున్నాయి.

**రికార్డు స్థాయిలో పెట్టుబడులు... పర్ఫెక్ట్ మానిటరింగ్:** 'ఆంధ్రప్రదేశ్ ఈజ్ బ్యాక్' అనే నినాదం ఇప్పుడు దేశవ్యాప్తంగా మారుమోగు తోంది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం వైపు చూడటానికే భయపడి, పెట్టుబడులు వెనక్కి తీసుకుని పారిపోయిన కంపెనీలు నేడు ఏపీ వైపు క్యూ కడుతున్నాయి. ఎంఓయూలు కుదుర్చు కోవడం, ఆ తర్వాత వాటిని పక్కన పెట్టేయడ మనేది గతంలో జరిగిన వ్యవహారం. ఆ విధానానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. ఎంఓయూల విష యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కుదు ర్చుకున్న ఎంఓయూలను నిరంతరం మానిటర్ చేసేందుకు ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా... కుదిరిన ప్రతి ఒప్పందాన్ని నిరంతరం పర్య వేక్షిస్తూ, కంపెనీలు క్షేత్రస్థాయిలోకి వచ్చేలా ప్రభుత్వం చేస్తున్న ఛేజింగ్ సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ నేతృత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఏమిటో ఏపీ దేశానికి కళ్లకు కట్టినట్టు చూపిస్తోంది. ఫలితంగానే దేశానికి వచ్చిన ఎఫ్‌డిఐల్లో 25.3శాతం ఎఫ్‌డిఐలు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చాయి. పెట్టుబడుల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అధికారులకు ప్రత్యేకంగా అప్పగించింది. ఎంఓయూల అమలుకు మూడు రీజి యన్లకు ప్రత్యేక నోడల్ అధికారులను నియ మించడంతో పాటు, జిల్లా కలెక్టర్లకు నిర్దిష్టమైన బాధ్యతలు అప్పగించారు. ఎంఓయూల విషయం లో దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా ఛేజింగ్ చేస్తుండడం వల్లే వల్లే అతి తక్కువ కాలంలోనే కంపెనీలు సాకారమవుతున్నాయి.

**36 రోజుల్లోనే ఆమ్కా.. గూగుల్ కోసం నిబంధనల మార్పు:** పెట్టుబడులు, పరిశ్రమలను గ్రౌండ్ చేసే విషయంలో ప్రభుత్వ వేగానికి, పట్టుదలకు తిలీదితి ప్రాజెక్టే నిలువెత్తు నిదర్శనం. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో అడుగుపెట్టి పనులు ప్రారంభించింది. ఆమ్కా విషయంలోనే కాదు ఇదే వేగంతో కేంద్ర ప్రభుత్వంతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ, ప్రత్యేక ఫోకస్ పెట్టడం ద్వారా దిగ్గజ సంస్థలన్నీ ఏపీ వైపు చూస్తున్నాయి. ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడం కోసం ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చర్చించి.. అవసరమైన మేరకు నిబంధనల్లోనే కీలక మార్పులు చేసేందుకు అంగీకరించేలా కేంద్రాన్ని ఒప్పించారు. అలాగే ఆర్సెల్లార్ మిట్టల్ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా స్లర్రీ పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్రాన్ని సీఎం చంద్రబాబు ఒప్పించగలిగారు. ఈ విధంగా ఏపీలో పారిశ్రామికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉంది. తద్వారా ఏపీకి మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు.. కంపెనీలు ఎస్టాబ్లిష్ చేసేందుకు మార్గాన్ని కల్పిస్తోంది. ఏపీకి పొరుగునున్న రాష్ట్రాలను కాదని ఏపీకి కంపెనీలు క్యూ కట్టడం ఆయా రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో పెట్టుబడుల విషయంలో నాయుడు గిరీ అంటూ జాతీయ పత్రికల్లో వచ్చిన కథనాలు ఆయా రాష్ట్రాల్లో చర్చకు దారి తీస్తున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ తమిళనాడును కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంతో తమిళనాడులో జరిగిన చర్చే దీనికి నిదర్శనం.

**ఎంఓయూల సాకారమిలా:** గతంలో లక్షల కోట్ల ఎంఓయూలు అంటూ ప్రచారం జరిగి.. క్షేత్రస్థాయిలో రూపాయి పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రూ. 21.64 లక్షల కోట్ల మొత్తం ప్రతిపాదిత పెట్టుబడుల్లో గణనీయమైన పురోగతి కన్పిస్తోంది. ఇప్పటికే ప్రాసెస్ లోకి వచ్చిన ఎంఓయూలు 68.02 శాతంగా ఉన్నాయి... డీపీఆర్ సబ్మిషన్ నుంచి గ్రౌండింగ్ దశ వరకు చేరిన ఎంఓయూలు 60.44 శాతంగా ఉంటే... భూ కేటాయింపులు దశను పూర్తి చేసుకున్న ఎంఓయూలు 21.39 శాతంగా ఉన్నాయి. మొత్తం పెట్టుబడుల్లో అతి తక్కువ కాలంలో మిగిలిన 68 శాతానికి పైగా పెట్టుబడులు ఇప్పటికే ప్రాసెస్ లోకి కీలక పరిణామంగా చెప్పవచ్చు. పెట్టుబడులను ఆకర్షించేలా పాలసీలు రూపొందిస్తూ ముందుకు వెళ్తుండడంతో ఏపీపై పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం పెరిగింది. అధికారుల్లో జవాబుదారీతనం కూడా పెరగడంతో జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వర్గాల్లో "ఏపీ ఈజ్ బ్యాక్" అనే చర్చ ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ యువతకు లక్షలాది ఉద్యోగాలు రావడం ఖాయమనే అభిప్రాయం వివిధ వర్గాల్లో వ్యక్తమవుతోంది.


**VIJAYAWADA MUNICIPAL CORPORATION**

**'E' Procurement Notice No.11/VMC/CDB/2026-27, Dt.09-06-2026**

Roads, Drain, repairs, maintenance works, Toilets, Street Light Maintenance,15th FCG works, Selection of Agency / Firm for Providing Voice Conference, SMS, Bulk WhatsApp and Voice Conference Broadcast Services to Vijayawada Municipal Corporation (Offline Tender) (Total 160 works)-Est. Amount Rs.2668.64 Lakhs.

All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of

Further details and any corrigendum can be seen@www.tender.apeprocurement.gov.in.

S/d-
For COMMISSIONER


# సమాజ మార్పుకు విద్యే ఆయుధం

- విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ సభలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్



**నెల్లూరు(వైద్యం), జూన్ 9 ప్రభాత వార్త:** ప్రపంచాన్ని మార్చడానికి ఉపయోగించ గల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని నెల్సన్ మండేలా చెప్పిన సందే శాన్ని గుర్తుచేస్తూ, విద్యార్థులు తమ విద్యను వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యా లయాల ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. మంగళవారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డా. కె.ఐ. వరప్రసాద్ రెడ్డి, ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్‌లకు విశ్వవిద్యాలయం ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్లపై అభినందనలు తెలిపారు. అలాగే డిగ్రీలు, పీజీ పట్టాలు, పీహెచ్‌డీలు, స్వర్ణ పతకాలు అందుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం గత పదిహేడు సంవత్సరాలుగా నాణ్యమైన విద్య, పరిశోధన, సామాజిక సేవల ద్వారా విశేష ప్రగతి సాధించిందని గవర్నర్ ప్రశంసించారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం పెరుగుతోందని పేర్కొన్న గవర్నర్, ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు.


**ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం**

**ఫారము నెం.VII**

[చట్టం నెం.30/2013 లోని సెక్షన్ 19(1) మరియు రూలు 25(1)ప్రకారం]

**రూఢి ప్రకటన**

**ఆర్.సి.నెం. 01/2026-సి.ఆర్.డి.ఎ.(అడ్మిన్.)** **తేది: 08.06.2026**

క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామములో గల **0.65 ఎకరముల భూమి** ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా **"అమరావతి రాజధాని నగర ప్రాజెక్ట్ లో భాగముగా – E3 (సీడ్ అక్సెస్) రోడ్డు నిర్మాణం నిమిత్తము"** అవసరమని, గుంటూరు జిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున, సదరు భూముల యందు ఆసక్తి గల వ్యక్తులు అభ్యంతరములను దాఖలు చేసినందున చట్టం 30/2013 లోని సెక్షన్ 15 ప్రకారము విచారణ మీదట మరియు ఆంధ్ర ప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, రాయపూడి వారు భూసేకరణకు అవసరమగు పైకమును జమ చేసి యున్నందున సంతృప్తి చెందినవారై గుంటూరు జిల్లా కలెక్టరు గారు చట్టం 30/2013 లోని సెక్షన్ 19(1) ప్రకారము ఈ క్రింది డిక్లరేషను చేయుచున్నారు.

**రూఢి ప్రకటన**

దిగువ షెడ్యూలులో పేర్కొనిన **0.65 ఎకరముల భూమి,** చట్టం 30/2013 (కేంద్ర చట్టం) లోని సెక్షన్ 19(1) ప్రకారము ప్రజాహిత కార్యక్రమాలకు అనగా **"అమరావతి రాజధాని నగర ప్రాజెక్ట్ లో భాగముగా – E3 (సీడ్ అక్సెస్) రోడ్డు నిర్మాణం నిమిత్తము"** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, రాయపూడి వారు ఏర్పాటు చేయుటకు అవసరమని గుంటూరు జిల్లా కలెక్టరు గారు ధ్రువీకరించు చున్నారు.

**షెడ్యూల్**

జిల్లా: గుంటూరు మండలము: తాడేపల్లి గ్రామము : పెనుమాక

| క్ర. సం | సర్వే నెం. | మొత్తము విస్తీర్ణము (ఎ.లలో) | సేకరించ వలసిన విస్తీర్ణము (ఎ.లలో) | వర్గీ కరణ | ఆసక్తి గల వ్యక్తుల పేర్లు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు / కట్టడములు / పంటలు మొదలగునవి |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | | | | 8 |
| 1 | 39-2బి | 0.65 | 0.65 | మెట్ట | చోడిశెట్టి నిర్మలత, W/o మన్మధరావు | 21 | 39-2 (భాగము) | 39-2 (భాగము) | 39-2 (భాగము) | - |
| | మొత్తం | | 0.65 | | | | | | | |

స్పెషల్ డిప్యూటీ కలెక్టరు మరియు భూసేకరణ అధికారి, పెనుమాక వారి కార్యాలయము నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించుకొనవచ్చును.

సదరు భూ సేకరణ వలన ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబములు మరియు ప్రాజెక్టు వలన ప్రభావితము కాగల కుటుంబములు **ఏమియూ లేవు.**

ప్రాజెక్ట్ నిర్మాణ దశలో అవసరమైన భాగములో గనులు మరియు ఖనిజములు త్రవ్వుట, తొలగించుట, వినియోగించుట తప్ప భూసేకరణ షెడ్యూలు లో మిగిలిన భూములలో ఉన్న బొగ్గు గనులు, యినుప రాయి, పలకరాయి లేదా యితర ఖనిజములు అవసరము లేదు.

ప్రదేశం: గుంటూరు
తేది: 08.06.2026

సం/- CM. సాయికాంత్ వర్మ, I.A.S.
జిల్లా కలెక్టర్, గుంటూరు


వార్త

జడప్రాయంగా ఉన్న అమిత జ్ఞానం కన్నా చైతన్య రూపంలో ఉన్న పరిమిత జ్ఞానం మిన్న.

- ఖలీల్ జిబ్రాన్

# ఉసురు తీసిన ఉప'ద్రవ'ం

'ప్రమాదాలు చెప్పిరావు. ప్రాణాలు చెప్పిపోవు' ప్రతి ప్రమాదానికి ఇదే ట్యాగ్‌లైన్. ఎంతో సజావుగా సాగుతోందనుకున్న విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీలో సోమవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 9 ప్రాణాలు కొడిగట్టాయి. అదేదో ఊపిరాడక ఉసురుమన్న ప్రాణాలు కావవి. అత్యంత వేడిమితో ఉండే స్టీల్ లిక్విడ్ మీద పడి సజీవ దహనమయ్యారు. అనుకోని ప్రమాదమే అయినా 'లిక్విడ్ స్టీల్' (ద్రవ ఉక్కు) తరలిస్తుండగా ఇలాంటి ప్రమాదాలు తప్పవని ఊహించగలిగిదే. గత 2 నెలలుగా 27 సార్లు ల్యాడిల్ గతి తప్పి స్టీల్ మెల్టింగ్ దుర్ఘటనలు జరిగాయి. ఒకసారి కాకపోయినా మరోసారైనా అలాంటి సందర్భాల్లో తీసుకోదగిన జాగ్రత్తలపై కార్మికులకు, వారిని పర్యవేక్షించే అధికారులకు అవగాహన ఉండే ఉంటుంది. కానీ అవేమీ వారిని చావునుంచి తప్పించలేకపోయాయి. మానవ తప్పిదం కాకపోయినా సాంకేతికత భద్రత విషయంలో యాజమాన్య నిర్లక్ష్య వైఖరి లేదని చెప్పలేము. లాడెల్ నుంచి పైకెగిసిన ద్రవ ఉక్కు నేలపై విరజిమ్మిన సందర్భాల గురించి గతంలోనూ కార్మికులు ఇబ్బందులెదుర్కొన్నారని కార్మిక సమూహాలు చెప్పుకుంటున్నాయి. 33 ఏళ్లలో ఇలాంటి ప్రమాదాలు జరగలేదని అక్కడ అధికారులు నేతలతో చెప్తున్నారు. కానీ 14 ఏళ్ల క్రితం జూన్ నెలలో ఇదే ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో 19 మంది కార్మికులు మృతిచెందారు. జూన్ 13, 2012న ఆక్సిజన్ రిన్సింగ్ రిడక్షన్ స్టేషన్ దగ్గర ప్రేలుడు సంభవించింది. అది విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన ప్రమాదం. భద్రతా ప్రొటోకాల్స్ సరిగా పాటించలేదని కార్మిక సంఘాలు ఆరోపించాయి. సాధారణంగా ఇలాంటి ప్రమాదాల్లో నిర్లక్ష్యం ఒక కారణం కాగా భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమూ ప్రధాన సమస్యగా ఉంటుంది. వీటన్నిటినీ అజమాయిషీ చేసే మానవ తప్పిదమూ అనేక సందర్భంలో కారణాలుగా బయటికొచ్చాయి. లాడెన్ నుంచి విరజిమ్మిన ద్రవపు ఉక్కు సుమారు 1540 డిగ్రీల సెల్సియస్ వద్ద మరగించినదై వంద టన్నులకు పైగా ఉంటుంది.ఇలాంటి ద్రవం మీద పడితే తప్పించుకునే అవకాశం ఉండదు. ఈ విధంగా 'ద్రవ' రూపంలో ఉన్న ఉక్కు మీద పడి ప్రాణనష్టం జరిగిన దుర్ఘటన మరెక్కడా నమోదవలేదు. బ్లాస్ ఫర్నేస్‌లో అత్యంత అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేసిన ముడి ఇనుమును ద్రవ ఇనుముగా మారిన తర్వాత లాడెల్‌లో ఉంచి తర్వాత ప్రక్రియకు తరలిస్తారు. ఆ మంటల్లో కాలి ముద్దయిన మృతదేహాలు ఎవరివో గుర్తించేందుకు ఏ ఆనవాయితీ దొరకలేదు. అది ఎవరిదో గుర్తుపట్టాలంటే ఒక్క డిఎన్ఎ పరీక్షలే శరణ్యం. ఆ రిపోర్టులే ఆ మృతదేహాలను వారి కుటుంబాలకు చేర్చగలవు. ల్యాడెల్ పేలుడు అనేది ఇదే ప్రథమం. కానీ దురదృష్టంలో కూడా అదృష్టమేమిటంటే ప్రమాద సమయంలో కొంత మంది 'టీ' విరామానికి బయటకు వెళ్లడం వలన ప్రాణనష్టం తగ్గింది. ఇలాంటి ప్రమాదాల్లో జరిగిన మరుక్షణాల్లోనే కాలి బూడిదవడమో, ముద్దలుగా మారడమో చూస్తుంటాం. చూడగలిగిన వారికి ఎంతో హృదయ విదారకమైన దృశ్యాలే కానవస్తాయి. నేతలదిగ్భ్రాంతులు, పరామర్శలు, నష్టపరిహారాలు ప్రకటన ఇవన్నీ కాలహరణమే తప్ప మృతి చెందిన వారి కుటుంబాలకు ఊరట నివ్వవు. తాజా ప్రమాదంలో కాలం చెల్లిన యంత్రాలు కాలదోషం పట్టిన ప్రమాదాలు, మానవ తప్పిదాలుగా చెప్పబడే ఏ అంశాలను చర్చించుకోజాలము. ల్యాడెల్‌ను హ్యాండిల్ చేయడంలో నిర్లక్ష్యమేమైనా ఉందా? ఇకపై ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఇంకా ఏదైనా ఆధునిక సాంకేతికత అవసరముందా?అన్న అంశాలపై నిపుణులు సూచనలు తీసుకోవాలి. రెండు నెలల నాడు ల్యాడెల్‌లో ద్రవం ఒలికిపోయి కార్మిక జనం కకావికలైన సందర్భంలోనే యాజమాన్యం ఆధునికత కోసంనిర్ణయం తీసుకుని ఉంటే మళ్లీ మళ్లీ అదే స్థాయి ప్రమాదాలు జరగకుండా ఉండేవేమో! దేశవ్యాప్త పారిశ్రామిక ప్రమాదాల్లో ఒక ఆందోళనకర ధోరణి తాజా ప్రమాదం దృష్ట్యా ప్రతిష్టకు ముందే ల్యాడిల్, క్రేన్, కన్వేయర్, స్లైడ్‌గేట్ వాల్వులు వంటి అధిక ఉష్ణోగ్రత పరికరాలను తనిఖీ చేయాలి. అవి పాతవైయంటే మార్చాలి. ఉత్పత్తి లక్ష్యాల పెంపు లాభార్జన ధ్యేయంతో పాటు కార్మిక భద్రతకూ ప్రాధాన్యతనివ్వాల్సిన ఆవశ్యకత కన్పిస్తోంది. పారిశ్రామిక భద్రతపై ఉన్న ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సిన తరుణం ఆసన్నమైంది. అత్యాధునిక పరికరాల వినియోగం, యంత్రాల నిర్వహణ ప్రమాదాల ముందస్తు హెచ్చరిక వ్యవస్థల పెంపు, ఆధునిక సాంకేతికతపై కార్మిక శిక్షణ, కార్యక్రమాల నిర్వహణ అత్యంత ఆవశ్యకం. దేశంలో పారిశ్రామిక ప్రగతి వేగంగా దూసుకుపోతోందని చెప్పుకోవడమే తప్ప కార్మిక భద్రత విషయంలో పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. పరిశ్రమ పరిశ్రమకు ప్రత్యేక భద్రతా చర్యలుంటాయి.వాటి మీద చర్చించేందుకుఅంతర్గత భద్రతా కమిటీలుండాలి. ఒకప్పుడు విశాఖ ఉక్కు కర్మాగారం పరిశ్రమలకే తలమానికంగా ఉండేది. స్టీల్ ప్లాంట్‌లో ప్రారంభంలో 18వేల మంది ఉద్యోగులుండగా ప్రస్తుతం 8వేల మంది మాత్రమే. అప్పుడున్న కార్మిక భద్రత ఇప్పుడు లేకపోవడమే చెప్పుకోదగినది. భద్రతా ప్రమాణాలు సరిగా ఉండవనే అభిప్రాయం కలిగితే కార్మికులు కూడా దొరికే పరిస్థితి ఉండదు. దేశంలోని ప్రధాన స్టీల్ ప్లాంట్స్ ఏటా జరిగే ప్రమాదాల్లో 50మంది వరకు చనిపోతుంటారని అంచనా. తాజా దుర్ఘటనలు జరిగినప్పుడైనా దేశవ్యాప్త పరిశ్రమల్లో మరో ప్రమాదఘటన లేకుండా తీసుకునే చర్యలకు అంకురార్పణ చేయాలి. ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి.



ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలా కష్టమైన పని.

సిసిరో



బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.

జార్జి ఇలియట్

## ప్రజావాక్కు



### హర్షణీయం

**తమిళనాడు** ప్రభుత్వంప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచి విలువలు, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ఉద్యోగావకాశాల కల్పన

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రం అమరావతి వేదికగా రూపుదిద్దుకుంటున్న అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ ఒక చారిత్రాత్మకఘట్టం. భారతదేశంలోనే మొట్టమొదటి క్వాంటం టెక్ పార్క్‌గా గుర్తింపు పొందనున్న ఈ కేంద్రం, ఉద్దండరాయునిపాలెంలో ఏర్పాటు అవుతోంది. దీని ప్రధాన లక్ష్యం 133 క్యూబిట్ల క్వాంటం కంప్యూటర్ (సిస్టమ్ 2)ను నెలకొల్పడం. ఐబీఎం,టీసీఎస్ వంటి గ్లోబల్ సంస్థల సహకారంతో రూపొందుతున్న ఈప్రాజెక్ట్ ద్వారా పరిశోధకులు, స్టార్టప్‌లకు అత్యాధునిక సాంకేతిక వనరులు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్ట్ వల్ల దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. క్వాంటంకంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు క్రిప్టోగ్రఫీ వంటి రంగాలలో యువతకు శిక్షణ ఇచ్చి ప్రపంచ స్థాయి నిపుణులుగా తీర్చిదిద్దుతారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలి

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అధీనంలో నడుసున్న కేంద్ర ఉద్యోగుల ఆరోగ్యపథకం ఇటీవల అనేకషరతులు, నియమాలు,కుదింపులు విడుదలవుతున్నవి.నిధులు జాగ్రత్తగా వినియోగంకావడం మంచిదే.ఏపీలో ఉన్న అన్నికేంద్రాలు ఇతరప్రభుత్వ భవనాలలోనే కొనసాగుతున్నాయి. ఏదైనా కొత్త కేంద్రం మంజూరు ఎంతోకాలం నుండి పెండింగ్ ఉన్నది.ఇతర నిధులతోపాటు ప్రధానమైన స్థలం సేకరణ లేదా తాత్కాలిక భవనం కోసం సత్వర చర్యలు అత్యంత ప్రాధాన్యతతో జరగాలి.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### హాజరు తప్పనిసరి

ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్స్ ప్రతిరోజు తప్పకుండా డ్యూటీలకు హాజరు కావాలి. ఉద్యోగి వర్కర్‌కు బదులుగా ఇంకొకరిని పంపడం పనిచేయించడం చట్ట విరుద్ధం. వర్కర్లు పనిచేయకుండా ఇంటి వద్ద ఉంటూహాస్టల్‌వార్డెన్ సన్నిహితంతో ఉద్యోగి పనిచేయకుండా ఇంకొకరిని పనికి పెట్టి తాను జీతం తీసుకోవడం జరుగుతుంది. ఈవిధానానికి ఈ విద్యాసంవత్సరం స్వస్తి పలకాలి. ఎవరి పనులు వారు చేయాలి. ఏ ఉద్యోగి అయితే ఎవరు ఉద్యోగి అయితే వారే పని చేయాలి. రుచికరమైన వంటలు విద్యార్థులకు వండించాలి.గత కొన్నిసంవత్సరాలుగా సంక్షేమ హాస్టల్లో వర్కర్స్ పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారు. నెలకు ఒకసారి వచ్చి సంతకాలు పెట్టి జీతాలు తీసుకుంటున్నారు. ఇలాంటి వారిని పనుల నుండి తొలగించాలి. ప్రతి జిల్లాలో ఉన్నత అధికారులు ప్రతి వర్కర్‌కు నోటీసులు జారీ చేసి తప్పకుండా హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- రాపాక రవీందర్, జనగాం

### ఉచిత మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి

చంద్రబాబు మహిళలకు ఫ్రీ బస్సు అన్నారు...బస్సు దిగి బస్టాండులో మూత్రానికి వెళ్తే ఐదు రూపాయలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.హైదరాబాద్ మహాత్మా గాంధీ బస్టాండులో ఉచిత మూత్రశాల అని తాటికాయంత అక్షరాల తోబోర్డులు కనిపిస్తాయి.విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండులో ఐదు రూపాయలు చెల్లించి అడుగు పెట్టమని గుమ్మడికాయంత అక్షరాలతో దర్శనం ఇస్తూ రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో ఇదే పరిస్థితి. ఉచిత బస్సుఆనవాళ్లు ఉచిత మూత్రశాల అనలేరా! విజయవాడ బస్టాండు ప్రతి రోజు వేలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. ఆర్టీసీకి లక్షల్లో ఆదాయం ఉంటుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పాత హాజరు పద్ధతే మేలు

దేశవ్యాప్తంగా నిరుపేద కూలీలు పస్తులు ఉండకుండా నిరంతరం పని చేసుకుంటూ ఆర్థిక జీవనంతో జీవించాలని ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం...ఇప్పుడెందుకో కనుమరుగయ్యేలా ఉంది.పని ప్రదేశంలో ఉపాధి కూలీల కష్టాలు అంతా ఇంతా కావు. పని చేసేది ఒక ఎత్తయితే అరగంట అయినా హాజరు పడని వైనం యాప్ ల పేరిట అరిగోసలు పెడుతూ అంతం చేస్తున్నారు.పని చేసుకుని బ్రతికేవాడి మీద ఇన్ని కుట్రలా? పాత హాజరు పద్ధతిని ప్రవేశపెట్టాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# నేరస్థులు తప్పించుకోలేరు..

**మన పూర్వీకులు యుగాలను గురించి చెప్పుండేవారు. త్రేతా యుగంలో ధర్మం నాలుగు పాదాలా నడిచిందని, ద్వాపర యుగంలో పాదాల సంఖ్య తగ్గిందని, కలియుగంలో ధర్మానికి పాదాలుదాదాపు కరవయ్యాయని పెద్దలు సెలవిస్తుంటే నవ్వొచ్చేది! ఒకేసారి ఈరోజుల్లో విస్తరిస్తున్న నేరమయ చరిత్ర చూస్తుంటే పూర్వీకులు ఇంగిత జ్ఞానంతోముందు జరగబోయే కాలాలను సమీక్షించినట్లుగా చెప్పకనే చెప్పారు! 'ధర్మం కలియుగంలో కరువైపోతుందని!' ఎంత నిజం? ఒక పత్రికలోని ఒక పేజీలోని వార్తలు చదివిన సామాన్య పాఠకుడికి ధర్మం పూర్తిగా ఈ రోజుల్లో దారితప్పిన పరిస్థితి అర్థమై దిగులు గుబులు వదల్లేదు!**



రావులపాటి సీతారాంరావు

మన పూర్వీకులు యుగాలను గురించి చెప్పుండేవారు. త్రేతా యుగంలో ధర్మం నాలుగు పాదాలా నడిచిందని, ద్వాపర యుగంలో పాదాల సంఖ్య తగ్గిందని, కలి యుగంలో ధర్మానికి పాదాలుదాదాపు కరవయ్యాయని పెద్దలు సెలవిస్తుంటే నవ్వొచ్చేది! ఒకేసారి ఈరోజుల్లో విస్తరిస్తున్న నేరమయ చరిత్ర చూస్తుంటే పూర్వీకులు ఇంగిత జ్ఞానంతోముందు జరగబోయే కాలాలను సమీక్షించినట్లుగా చెప్పకనే చెప్పారు! 'ధర్మం కలియుగంలో కరువైపోతుందని!' ఎంత నిజం? ఒక పత్రికలోని ఒక పేజీలోని వార్తలు చదివిన సామాన్య పాఠకుడికి ధర్మం పూర్తిగా ఈ రోజుల్లో దారితప్పిన పరిస్థితి అర్థమై దిగులు గుబులు వదల్లేదు! పేదల పాలిటి పెన్నిధిగా భావించిన ఒక గ్రామంలోని ప్రజలకు ఆ పెన్నిధి ఆస్తిపాస్తులు దొంగిలించిన నేరమయ చరిత్ర కలిగిన ప్రబుద్ధుడిగా పోలీసు దర్యాప్తులో తేలినప్పుడు అవాక్కయి, తర్వాత తేరుకొని ముక్కుమీద వేలు వేసుకోక తప్పలేదు! ఆ గ్రామంలో అవసానదశకు వచ్చిన ఒక వృద్ధుడు మాత్రం అందరిలా ఆశ్చర్యపడకుండా 'కలికాలం గదా!' అని తనలో తను గొణుక్కున్నాడు! ఉత్తరప్రదేశ్లో ఒక గ్రామంలో ధార్మికుడిగా పేరుగాంచిన ఆ వ్యక్తిని తెలంగాణా పోలీసులు మాత్రం కరుడుగట్టిన నేరస్థుడిగా తేల్చటం, పెద్దలు 'కలియుగ ధర్మం'గా భావించటం మామూలుగా మారింది! అపర రాబిన్ హుడ్ లాంటి కథను తెలుసుకుంటే ఎవరైనా విస్తుపోక తప్పదు! వికాస్ సింగ్ ఠాగోర్ అనే ఆ వ్యక్తి యు.పి.లోని ఒక గ్రామంలో చాలా రోజులు దేవుడు యిచ్చిన వరంగా పేదలకు సహాయపడ్డాడు! బడికిపోయే పిల్లలకు స్కూల్ బ్యాగ్లు ప్రేమతో యిచ్చేవాడు. అంతేగాదు అట్టడుగు వర్గాల ఆ గ్రామ ప్రజలను కష్టాల్లో ఆదుకొని ధన సహాయం చేసేవాడు. తోటి స్నేహితులకు తన ఖర్చుతో విలాస యాత్రలు ఏర్పాటు చేసేవాడు. తను ఎప్పుడు ప్రయాణించినా విమానాల్లోనే, పెద్ద పెద్ద హోటళ్ళలోనే నివాసం! అంతటి వ్యక్తి తెలంగాణాలోని వికారాబాద్ మణికంఠ నగర్ కాలనీలో పట్టుబడి రాజూ–పేదా డబల్ రోలను పోలీసుల దర్యాప్తు వల్ల వదిలేసి కటకటాలు లెక్కపెట్టాల్సిన పరిస్థితి రావటం అతనికి ఎంత విషాదం? యు.పిలోని గ్రామ పేదలకు, స్నేహితులకూ ఎంత నిరాశ, పోలీసులకు పెద్ద దొంగను పట్టుకున్నందుకు గర్వంతో కూడిన ఆనందం! విధి నాటకాలు ఆడటం అంటే యిదే! విభిన్న కోణాల్లో ఒక వ్యక్తి జీవితం సినిమాలలో ఒళ్ళు గగుర్పొడిచే రీతిలో చిత్రీకరించటం జరుగుతే థియేటర్ల నుండి సంబరంగా బయటకు వచ్చే ప్రేక్షకులకు నిజ జీవితంలో ఇలాంటి వ్యక్తులు తారసపడుతారు బహుపరాక్ అని పోలీసులు హెచ్చరిస్తే ఎంత భయం కలుగుతుంది! ఇలాంటి నేరమయ చరిత్ర కలిగిన వారు పట్టుబడితే ధర్మం ఇంకా కుంటుకుంటూ నడుస్తూనే వుంది అని పాతకాలం వారికి సంతోషం కలుగుతుంది! తెలంగాణాలో అతను వేసిన వేషం 'కూలీ వేషం! రోజువారీ పనిచేసే కూలీగా తిరుగుతూ కాలనీలలో ఏయే ఇళ్ళకు తాళాలు వేసివున్నాయో గమనిస్తూ, రాత్రిళ్ళు ఎన్నో దోపిడీలు అలాంటి తాళం వేసిన ఇండ్లలో చేస్తూ దోచుకున్న సొమ్ముతో యుపిలోని తన గ్రామంలో తన స్నేహితులకూ, పేదవారికీ, పిల్లలకు ఆర్థిక సహాయం అడగకుండానే చేస్తూ, విలాసవంతమైన జీవితం గడుపుతూ ఒక వెలుగు వెలిగిన వికాస్ సింగ్ ఠాకూర్, పోలీసులకు దొరికిపోవటంతో వికాసాన్ని కోల్పోయ్యాడు!



దాదాపు 1.57 కె.జీల బంగారం, 2.56 కె.జీల వెండి, 8 కోట్ల 22లక్షల నగదు, దొంగిలించానని పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. 16వ సంవత్సరం నుంచే దొంగత నాలు మొదలుపెట్టి 34కేసులు పోలీసు రికార్డులో నమోదు కాబడిన ఘన చరిత్ర కలిగిన వ్యక్తి ఈ ఘనమైన దొంగ వికాస్! ప్రస్తుతం వికారాబాద్ పోలీసుల దర్యాప్తులో తేలిన కేసులు కట్టితే అతని దొంగతనాలసంఖ్య 61 కి చేరింది! సుల్తానాపూర్ జిల్లాలో నలుగురు బంగారం వ్యాపారస్థులు అతనికి అండదండలు కల్పించి,దొంగిలించిన నగలు తాము తీసుకొని, వికాస్కు కొంత ప్రతిఫలం ఇస్తూ అవసరమైనప్పుడు డబ్బు సహాయం గూడా చేసేవారట! తల్లిద్వారా బంగారాన్ని వాళ్ళకు చేర వేసేవాడట! తోటకూర దొంగిలించినప్పుడు మందలించని తల్లి చరిత్ర కన్నందుకు తల్లి అనుభవించక తప్పదు! ధర్మ దేవత పడుతూ లేస్తూ నడుస్తున్నట్లు ఈ సంఘటనతో భావించక తప్పదేమో! వికారాబాద్ పోలీసులూ ఉన్నతాధికారులూ,వికాస్ ఠాకూర్ చరిత్ర ఒకకొలిక్కి తెచ్చినందుకు అభినందించక తప్పదు! మరో నేరమయ చరిత్ర అదే పేజీలో ఉంది. గంజాయి (మారిజునా) పంటను విస్తృత స్థాయిలో థాయి లాండ్ వరకు విస్తరింప చేసిన తెల్ల చొక్కాల నేరస్థులను కొత్తగా ఏర్పడిన 'ఈగల్ ఫోర్స్' (పోలీసులలో ఒక భాగం) పట్టుకొని చరిత్రలో కొత్త పేజీలను సమకూర్చింది! 300 వాహనాలు, 405 సార్లు ఫ్లైట్ బుకింగ్స్, (కేవలం విమా నాల్లో ప్రయాణించినందుకే కోటి రూపాయలు ఖర్చుపెట్టిన వైనం, నీటితో ఏర్పాటు చేయబడ్డ భూములు థాయిలాండ్లో ఏర్పరుచుకొని దాదాపు 30కోట్లు ఖర్చుచేసి 'పట్టాయా స్టైల్ నైట్ క్లబ్బు హైద్రాబాద్లోని కోకాపేట్ ప్రాంతంలో ఏర్పాటుచేసుకొనే ప్రయత్నంలో వున్నప్పుడు వీరిని వలపన్ని పోలీసులు పట్టుకోవటం జరిగింది! 40మంది ఈనెట్వర్క్ వున్నారు. చాలామంది అరెస్టు కూడా అయ్యారు! హేమంగ్ ప్రమోద్ కెల్సుకర్, సుధాంశ్ ప్రమోద్ కెల్సుకర్ (బొంబాయికి చెందినవారు) ఈ ముఠాను నడుపుతున్నారు.దాదాపు 2023నుంచి తెలంగాణా, మహారాష్ట్ర, గుజరాత్,యు.పి., మరికొన్ని రాష్ట్రాలలో గూడా లింక్స్ ఏర్పరుచుకొని పకడ్బందీగా నడుపుతున్న ఈడ్రగ్స్‌కు సంబంధించిన వ్యవహారం పోలీసుల నిఘా వల్ల బయట పడింది! ఇంత పెద్ద నేరస్థులను పట్టుకున్న ఈగల్ ఫోర్స్ ఉన్నతాధికారులు గూడా కష్టంతో గూడిన పనిని విజయవంతంగా చేసినందుకు ప్రజలు ఎంతో ఆనందిస్తున్నారు! ఒరిస్సాకు సంబంధించిన అంతరాష్ట్రీయ గంజా స్మగ్లర్ను దిల్‌సుఖ్ నగర్ పోలీసులు గంజాను అమ్ముతుండగా పట్టుకున్నారు. రమేష్ బండాం, నిర్మల్ ఛత్రియా (ఒరిస్సా వాసులు) పట్టుబడ్డవార్త గూడా అదే పేజీలోవుంది! ఇవేమో బాహాటంగానో, దొంగచాటుగానో చేసే దొంగతనాలు!మోసం చేసి అధికారుల కళ్లుకప్పి తెలివిగా చేయటానికి వేసిన నేర ప్రయోగం కూడా ఇదే పేజీలో చోటుచేసుకోవటం విశేషం! సైబరాబాద్ పోలీసులు ఇలాంటి నేరస్థులతో జాగ్రత్తగా వుండండి అని హెచ్చరిం చటంతో వీరి పనితనం బయటకు వచ్చింది. మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్ వారిచే నియమించబడ్డ ఉద్యోగస్థులమని, వాట్స్అప్, మెసేజీలను కొన్ని ప్రాంతాలలో నివసించే పౌరు లకు పోస్టుచేసి మీరు కట్టాల్సిన వాటర్ బిల్లుఇంకా చెల్లించలేదు మేము కనెక్షన్ తీయక తప్పదు అని డబ్బులువసూలు చేయటానికి ప్రయత్నించిన వారి వ్యూహం బయటపడింది.అయితే వారి వివరాలు వార్తల్లోకి ఎక్కలేదు కాని ఈ హెచ్చరికతో హైద్రాబాద్లో నివాసం చేసేవారు జాగ్రత్తగా వుండక తప్పదు!ఒక్క పేజీలోనేవైవిధ్య భరితమైన ఈ నేర చరిత్ర లు చదివిన ఏ పాఠకుడైనా 'అయ్యబాబోయ్' అని అనుకోకతప్పదు. కానీ పై పోలీసులు తగు రీతిలో పట్టుకొని నేరాలను అదుపుచేసే ప్రయత్నంలో వున్నారని తెలిసిన తర్వాత ఆ వివరాలు తెల్పాలనే ఈ ప్రయత్నం! ఎప్పుడూ పోలీసుల వైఫల్యాలే బయటకు వస్తాయి కానీ వారి విజయవంతమైన పనితీరు ఎప్పుడోగాని పత్రికల్లోకి ఎక్కదు!ధర్మం ఈకాలంలో కూడా కొద్దోగొప్పో తప్పకుండానే ఉందని పెద్దలు అనుకుంటూ వున్నారు!. ●

# ప్రపంచ సుగంధ ద్రవ్యాల చిరునామాగా భారతదేశం


డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

మన వంట గది నుంచి మసాలా వాసనను బట్టి ఏ వంటకాలు చేస్తున్నారో, ఎంత రుచిగా ఉండబోతోందో తెలుస్తుంది. మన వంటలకు రుచులను ఆహార పదార్థాల్లో మూలికలు, సుగంధ ద్రవ్యాల (మసాలా దినుసుల) పాత్ర వెలకట్టలేనిది. వంటలకు రుచితోపాటు పలు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తున్న మసాలా దినుసుల ఉత్పత్తి, వినియోగం భారత్‌లో అధికంగా ఉండడం గమనిస్తున్నాం. మన వంటల్లో వాడుకునే అల్లం, వెల్లుల్లి, జిలకర్ర, ఒరిగానో, గసగసాలు, పచ్చి మిరపకాయలు, ఉల్లి కాడలు, సాంబ్రాణి, కొత్తిమీర, పుదీనా, జాజికాయ, స్టార్ అనైస్, వనిల్లా,చింతపండు,జాపత్రి, మెంతులు, ఆవాలు,ఇంగువ, పసుపు, ధనియాలు, నల్ల/తెల్ల మిరియాలు, లవంగాలు, యాలకులు, సోంఫ్, మిరపకాయలు,దాల్చినచెక్క, బగారా ఆకు లాంటి అనేక మసాలా దినుసులు తాజాగా లేదా ఎండిన (పండ్లు/ఆకులు/బోర్డు/వేర్లు/పూలు) మూలికలు, సుగంధ ద్రవ్యాలు మన ఆరోగ్యకర జీవితాలతో విడదీయరాని బంధాలను పెనవేసుకున్నాయి. మనం నిత్యం వంటల్లో వాడుకునే మసాలాదినుసుల ప్రాధాన్యం, ప్రయోజనాలను అవగాహన పరచడానికి ప్రతి ఏటా 10 జూన్ రోజు జాతీయ మూలికలు, సుగంధ ద్రవ్యాల దినోత్సవం (నేషనల్ హెర్బ్స్ అండ్ స్పైసెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి,వినియోగం, ఎగుమతుల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నది. కేరళను ప్రపంచ సుగంధ ద్రవ్యాల తోట(గార్డెన్ ఆఫ్ స్పైసెస్)అని పిలుస్తారు. కేరళలో యాలకులు, నల్ల మిరియాలు, దాల్చిన చెక్క, లవంగాలు, జాజికాయ, జాపత్రి,పసుపు, అల్లం లాంటి సుగంధ ద్రవ్యాలు విస్తారంగా పండుతాయి. మన దేశంలో లభించే దాల్చినచెక్క, పసుపు, తులసీ వంటి పదార్థాలు మన ఆరోగ్యాలకుఎంతో మేలును చేస్తున్నాయి. సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి,వాడకం, ఎగుమతుల్లో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉండడం హర్షదాయకం. చైనా, వియత్నాం లాంటిదేశాలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. దాదాపు 41కి పైగామసాలా దినుసుల నిధిగా భారతం వర్ధిల్లుతున్నది. గింజలు,తరిగిన పొడులు, పొడులు,వేయించిన, నూనెలో వేయించిన, పైన చల్లుకునే మసాలా దినుసులు మన నిత్యజీవితాలతో అవిభాజ్య సంబంధాలను పెనవేసుకున్నాయి. కరోనా విపత్తు సమయంలో భారతీయుల ప్రాణాలను కాపాడడంలో వారిలో దాగిన రోగనిరోధకశక్తి మాత్రమేఅని, ఇది మనం తినే మసాలా వంటల వల్ల కూడా పెరుగుతుంది. ●

# పాలనలో నెహ్రూను దాటిన మోడీ

బెర్జిస్ దేశాయ్

జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి ప్రధానమంత్రిగా 1952 మే 13న పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆనాటి నుంచి 1964 మే 27న కన్నుమూసే దాకా 4,397 రోజులపాటు అవిచ్ఛిన్నంగా ఆ పదవిలో కొనసాగారు. ఆయన 1947 ఆగస్టు 15 నుంచే ప్రధానమంత్రిగా ఉన్నప్పటికీ, తాత్కాలిక పార్లమెంటుగా వ్యవహరించిన రాజ్యాంగ సభకు బాధ్యత వహించే మధ్యంతర ప్రభుత్వ అధిపతిగా మాత్రమే ఉన్నారనే వాస్తవం రాజ్యాంగ చరిత్రను నిశితంగా అధ్యయనం చేసేవారికి అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 4,398 రోజులు ఆ బాధ్యతలలో కొనసాగడం ద్వారా నేడు నెహ్రూ పదవీకాలాన్ని అధిగమించారు. మన దేశానికి సుదీర్ఘకాలం ప్రధానమంత్రులుగా పనిచేసిన మోడీ, నెహ్రూల పాలన శైలి పూర్తిగా భిన్నం. బాల్యం నుంచీ పెంపకం, ఆలోచన విధానం, విశ్వాసాలు,స్వభావం, పనితీరు శైలి, విలువల పంథా సహా రాజకీయ సిద్ధాంతాల రీత్యా ఇద్దరి ప్రస్థానం పరస్పర విరుద్ధం. నెహ్రూ ఒక సంపన్న బారిస్టర్ కుమారుడు, బ్రిటిష్ రాచబిడ్డలు చదివే హారో, కేంబ్రిడ్జిలోని ట్రినిటీ కళాశాలల్లో చదివారు. అయితే, బాల నరేంద్రుడికి అలాంటి విలాస జీవితం కలలోమాటే... రైల్వే స్టేషన్‌లో ఓ చిన్న టీ కొట్టు నడిపే తండ్రి నీడన, ఐదుగురు తోబుట్టువులతో కలిసి మోడీ పెరిగారు. కనీసం కరెంటు సౌకర్యం కూడా లేని, చీకటి రాజ్యం చేసే చిన్న ఇంట్లో, తిండికి కూడా తిప్పలు పడాల్సిన దుస్థితిలో వారి జీవనం సాగేది. ఆ పరిస్థితుల నడుమ మాతృభాషలోనే.. నాణ్యత మాటెరుగని సాధారణ విద్యను అభ్యసించారు. ఆ రోజుల్లో వారికి రేడియో లేదా వార్తాపత్రికలు అందుబాటులో లేవు. మోడీ కుటుంబానికి టూత్ పేస్టుబ్రష్షు, స్నానపు గదిషవర్ వంటి సౌకర్యాల మాట అటుంచి,కనీసం మరుగుదొడ్డి, కొళాయి నీటి సరఫరా సౌకర్యం కూడా ఉండేవికావు. అలాంటి జీవితం గడిపిన ఆయన, తన 17వ ఏట వ్యక్తిగత ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టి, ఇల్లు వదిలివెళ్లారేగానీ, మళ్లీ రానే లేదు! తన తల్లి గాజు పెంకులు కలిపిన బూడిదతో ఇతరుల ఇళ్లలో పాత్రలు కడుగుతుండగా ఆమె వేళ్ల రక్తం చిందడాన్ని చెమ్మగిల్లిన కళ్లతో బాల నరేంద్రుడు చూస్తూండి పోయేవాడు. నెహ్రూ విలక్షణ ఇంగ్లీష్ ఉచ్చారణ శైలి చూసి చేరువైన ఉన్నత వర్గాలవారు ఆయనను తమలో ఒకడుగా పరిగణించేవారు. స్వీయ అంతర్జాతీయ ప్రతిష్టపై అత్యంత శ్రద్ధ చూపే నెహ్రూ,మాతృభూమిని తన అస్పష్ట ఫేబియస్ ప్రబోధిత సామ్యవాద విశ్వాస కోణంలో చూడటం వల్ల భారత దేశం భారీమూల్యం చెల్లించాల్సి వచ్చింది. భారత్‌లో కశ్మీర్ విలీనం ప్రక్రియను ఆయన అమితాలస్యం చేశారు. పైగా అక్కడ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని కూడా హామీ ఇచ్చారు. అటుపైన సమస్యనుఐక్యరాజ్య సమితి స్థాయికి తీసుకువెళ్లారు.ఇది చాలదన్నట్లు పాక్ దురాక్రమణతో ఆక్రమిత కశ్మీర్‌గా మారిన ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలన్న భారత సైన్యానికి అనుమతి నిరాకరించారు. చైనీయులపై అమాయకత్వంతో కూడిన ఆయన నమ్మకం వ్యూహాత్మక అక్సాయ్‌చిన్ ప్రాంతం కోల్పోవడానికి దారితీసింది. మరోవైపు అదొక బంజరు నేల అంటూ నిర్లక్ష్యంగా కొట్టి పారేశారు. అత్యంత ఏకపక్ష సింధు జలాల ఒప్పందంపై సంతకంతో ఆ నదీజలాల్లో 80 శాతాన్ని పాకిస్థాన్ పరం చేయడమేగాక, కొన్ని బకెట్ల నీటి కోసం ఇంత రాద్ధాంతం ఎందుకో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.ఈ పరిణామాల నేపథ్యంలో 72 ఏళ్ల తర్వాతభారత పాలనాధికార పగ్గాలు చేపట్టిన మోడీ కశ్మీర్ ప్రత్యేకహోదా రద్దు ద్వారాఅసాధ్యమని భావించిన ఒక రాజ్యాంగ అద్భుతాన్ని సుసాధ్యం చేసి చూపారు. అప్పటి వరకూ పాకిస్థాన్ ఈ అంశాన్నొక ఉపకరణంగా మార్చుకుని అంతర్జాతీయ వేదికలపై రభస చేస్తూండేది.ఇదే తరహాలో ఒక సాహసోపేత నిర్ణయంతో సింధునదీ జలాల ఒప్పందాన్ని స్తంభింపజేసి, శత్రుదేశాన్ని ఆయన చావు దెబ్బకొట్టారు. ముందుచూపుతో కూడిన, ఆచితూచి స్పందించే సైనిక వ్యూహంతో దేశ సరిహద్దులను సురక్షితం చేశారు. వరుస తరాల అధికార యంత్రాంగం అభిప్రాయం ప్రకారం ఏవిషయాన్నైనా మోడీ అద్భుతమైన వేగంతో ఆకళింపు చేసుకుంటారు. ఆయన జిజ్ఞాస అపారం. అందుకే, ఏది చెప్పినా చెవియొగ్గి వింటారు. అత్యంత సూక్ష్మస్థాయిలో వివరాలను విశ్లేషిస్తారు. నిరంతర పర్యవేక్షణ మదింపు తర్వాత స్థిరమైన నిర్ణయం తీసుకోవడం ఆయన నైజం. సరైన సన్నద్ధత లేని, ఉదాసీన ధోరణి గలవారికి ఆయన దగ్గరఅస్సలు చోటుండదు. అయితే, తన సమక్షంలో వివరాలు ఏకరవు పెట్టడం నెహ్రూకు విసుగు తెప్పించేది. చంచల స్వభావి కావడంతో భావోద్వేగంతో నిర్ణయాలు తీసుకోవడం ఆయన అలవాటుగా ఉండేది. ఒక అభిప్రాయానికి వస్తే, మొండిగా దాన్ని సమర్థించుకునే ఓ సాధారణ పరిపాలకుడు.ఆయనను అమితంగా ఆరాధించే జేఆర్‌డీ టాటా ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆర్థిక శాస్త్రంపై చర్చ మీద నెహ్రూకు ఎంతమాత్రం ఆసక్తి ఉండేది కాదన్నారు. అలాంటి సందర్భాల్లో ఆయన కిటికీలో నుంచి తోటలో గంతులేస్తున్న జెయింట్ పాండా (ఎలుగుబంటి లాంటి జంతువు) ను చూస్తూండే వారని చెప్పారు. అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయికి చేర్చే నిబద్ధతకు బదులు సోవియట్ యూనియన్ తరహా పంచవర్ష ప్రణాళిక విధానాన్ని అనుసరిస్తూ భూసంస్కరణలు,జలాశయాల నిర్మాణం,భారీ పరిశ్రమల ఏర్పాటుకు నెహ్రూ ప్రాధాన్యమిచ్చారు. అయితే, పేదరిక నిర్మూలన దిశగాశాస్త్రీయ దృక్పథంతో మతాతీత,సమర్థ సంక్షేమ పాలన విధానాలను అనుసరించిన మోడీ, దేశంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. వీటన్నిటికీ వివరిస్తే దళారుల బెడద తప్పించి నిరుపేదలకు నేరుగా నగదు బదిలీ, వంటగ్యాస్ సిలిండర్ల సరఫరా,ఇంటింటికీ తాగునీటికొళాయి, పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రత్యక్ష సాయం, పేదలకు ఆరోగ్య బీమా, జన్‌ధన్ బ్యాంక్ ఖాతాలద్వారా ఆర్థిక సార్వజనీనత, మాతృత్వ సంక్షేమం లక్ష్యంగా నగదుసహాయం,పారిశుధ్యం ఇలా ఈ జాబి తాకు అంతూదరీ ఉండదు. ఇక కోవిడ్19 సంక్షోభ సమయాన ఏకోన్ముఖ ప్రభుత్వంపద్ధతిని నిక్కచ్చిగా అనుసరిస్తూ అత్యంత నిర్దిష్టసమయానికి సంపూర్ణదిగ్బంధం (లాక్‌డౌన్) విధించడం ద్వారా అస్తిత్వ సంక్షోభం నుంచి దేశాన్ని ఒంటిచేత్తో రక్షించారు.ఒక్కమాటలో చెబితే నెహ్రూ ఒక అస్పష్ట తార్కిక సిద్ధాంతకర్త కాగా, మోడీ ఒక అద్భుత పాలనాదక్షుడు నాస్తికుడినని స్వయంగా చాటుకున్ననెహ్రూ, పునర్నిర్మిత సోమనాథ్ ఆలయ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ హాజరుకాకుండా శాయశక్తులా ప్రయత్నించారు.అంతేకాకుండా ఆ సందర్భంలో రాష్ట్రపతి ప్రసంగ ప్రసారాన్ని ఆపేయాల్సిందిగా ఆకాశవాణి (ఆల్ ఇండియా రేడియో)ని ఆదేశించారు. తద్విరుద్ధంగా మోడీ అసంఖ్యాక సాంస్కృతిక పథకాల ద్వారా నాగరికత పునరుజ్జీవనాన్ని చురుగ్గా ప్రోత్సహించారు. రోజుకు కనీసం 16గంటల పనిలోనే విశ్రాంతి వెతుక్కునే నైజం మోడీది. అంతకుముందు మూడు దశాబ్దాల పాటుపూర్తికాల సంఘ్ ప్రచారక్‌గా,బీజేపీ కార్యకర్తగా మొత్తం మీద 55ఏళ్లుగా ప్రజా సేవలోనే మునిగితేలుతున్నారు. అయితే, మోడీలో కించిత్ అలసట గానీ, కాస్తంత ఉపశమన ధోరణిగానీ కానరావు. దేశంలోని 15 ప్రాదేశిక కమిటీలలో 12సర్దార్ పటేల్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడుగా నియమించేందుకు మొగ్గుచూపగా, మూడు తటస్థంగా ఉండిపోయాయి. అయితే, గాంధీజీ 12 కమిటీల అభీష్టాన్ని తోసిపుచ్చుతూ నెహ్రూకు ఓటువేయడం ద్వారా ప్రధాన మంత్రి అభ్యర్థిత్వానికి పటేల్‌ను దూరం చేశారు. ఆవిధంగా దేశంలో ఘనత వహించిన వంశపారపర్య రాజకీయ నేతగా నెహ్రూకు,ఆయన వారసత్వం ఇందిరాగాంధీకి బదిలీ అయ్యేలా అత్యంత శ్రద్ధతో పావులుకదిపారు. లక్ష్యమంటే అధికారం కోసం ఆరాటం కాదన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. అలాగే, గాంధీజీ తరహాలో సేవ,త్యాగం అనేవి ఒట్టి మాటలు కావన్నది మోడీ విశ్వసించే వాస్తవం. రాబోయే కొద్ది దశాబ్దాలలో నరేంద్ర మోడీ ఒక ఆదర్శప్రాయ దిగ్గజంగా నిలుస్తారు. ఎందుకంటే ఇకపై ప్రతి ఒక్కరి పనితీరుకూ నరేంద్ర మోదీ నిర్దేశిత ప్రమాణాలే కొలబద్ద. ●



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

**(ఈ వ్యాసకర్త మోదీస్ మిషన్ పుస్తక రచయిత)**

# అప్పీలు విచారణకు 43యేళ్లా?

## - అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, జూన్ 9:** అలహాబాద్ హైకోర్టు ఒక హత్య కేసు పరిష్కారంలో అసాధారణంగా 43యేళ్ల ఆలస్యం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది భారతదేశంలో నిరంతరంగా పేరుకుపోతున్న న్యాయపరమైన కేసుల సమస్యను ఎత్తి చూపుతోంది. నాలుగు దశాబ్దాలుగా నేరారోపణ నీడలో ఉన్న విజయ్ సింగ్ దాఖలు చేసిన అప్పీలు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సుదీర్ఘ ఆలస్యాలు కలవర పాటుకు గురిచేస్తున్నాయని, పేరుకు పోతున్న కేసులను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని హైకోర్టును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తన సొంత సోదరుడిని హత్య చేసినందుకు కాన్పూర్ సెషన్స్ కోర్టుచే దోషిగా నిర్ధారించబడిన విజయ్ సింగ్, తన శిక్షను సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీల్‌పై తీర్పు ఇవ్వడానికి అలహాబాద్ హైకోర్టు దాదాపు 43 ఏళ్లు తీసు కోవడంతో, నాలుగు దశాబ్దాలకు పైగా బెయిల్‌పైనే ఉన్నాడు. 1983 నవంబర్‌లో తన సోదరుడిని కాల్చి చంపినప్పుడు 28 ఏళ్ల యువకుడైన విజయ్, నత్తనడకన సాగే న్యాయ పంపిణీ వ్యవస్థ కారణంగా ఇప్పుడు డెబ్బై ఏళ్ల వృద్ధుడిగా ఉన్నాడు. అతని క్రిమినల్ అప్పీల్‌ను పరిష్కరించడంలో జరుగుతున్న అసాధారణ జాప్యాన్ని "ఆందోళనకరమైన పరిస్థితి"గా అభివర్ణిస్తూ, అలహాబాద్ హైకోర్టులో న్యాయ పంపిణీ వ్యవస్థను అడ్డుకుంటున్న పెండింగ్ కేసులను పరిష్కరించడానికి ఎలాంటి వినూత్న చర్యలు తీసుకోవచ్చునని సుప్రీంకోర్టు ఆశ్చర్య పోయింది. విజయ్ తన అప్పీల్ ఫలితం కోసం ఎదురుచూస్తూ, కేవలం మూడు నెలలు మాత్రమే కస్టడీలో గడిపి, దాదాపు 43 ఏళ్లపాటు బెయిల్‌పైనే ఉన్నారని ధర్మాసనం పేర్కొంది. దోషిగా నిర్ధారించబడటానికి వ్యతిరేకంగా చేసిన అప్పీల్‌ను హైకోర్టు ఫిబ్రవరి 9న కొట్టివేసిన తీర్పును సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంత కాలం బెయిల్‌పైనే కొనసాగేందుకు అనుమతించాలని ధర్మాసనం నిర్ణయించింది. అలహాబాద్ హైకోర్టులో త్వరిత గతిన విచారణ జరపాలని ఆదేశాలు కోరుతూ వ్యాజ్యదారులు తరచుగా సుప్రీంకోర్టును ఆశ్రయి స్తుంటారని ఎత్తి చూపుతూ, పాత కేసుల పరిష్కా రాన్ని వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దేవ్, న్యాయవాది జోహెబ్ హుస్సేన్‌ల నుండి సూచనలు కోరింది. మూడు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉన్న ప్రాసిక్యూషన్ అప్పీళ్లను కొట్టివేయడం ద్వారా పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించవచ్చని దేవ్ సూచించగా, కేవలం కేసులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో వాటిని కొట్టివేయడానికి తీర్పు ప్రక్రియ ప్రాథమిక సూత్రాలు అనుమతించవని ధర్మాసనం పేర్కొంది. అటువంటి విధానం ప్రజా ప్రయోజనాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని, అలాగే తమ వాదనలు వినిపించే అవకాశాన్ని కక్షి దారు లకు దూరం చేస్తుందని హెచ్చరించింది. సుదీర్ఘ జాప్యాన్ని ఎత్తి చూపుతూ, విజయ్ సుప్రీం కోర్టులో తన అప్పీలులో, తనకు ఇప్పుడు 72 ఏళ్లు వచ్చాయని, తన జీవితంలో ఎక్కువ భాగం ఒక నేరారోపణ నీడలోనే గడిపానని సమర్పిం చారు. "నాలుగు దశాబ్దాలకు పైగా, యవ్వనంలో, మధ్య వయస్సులో, ఇప్పుడు వృద్ధాప్యంలో కూడా, ఆయన ఆ నేరారోపణ నీడలోనే జీవిం చారు," అని పిటిషన్‌లో పేర్కొన్నారు. క్రిమినల్ అప్పీలు హైకోర్టులో 40 ఏళ్లపాటు పెండింగ్‌లో ఉండి,




# కాక్రోచ్ పార్టీకి పోటీగా ఇష్క్ కరో పార్టీ

## - ప్రకటించిన సుప్రీం మాజీ జడ్జి కట్జూ - పేదరికం, నిరుద్యోగంపై పోరాడుతాం - టిఎంసి ఎంపి మహువా మొయిత్రాను ఆహ్వానించిన జస్టిస్ మార్కండేయ

**న్యూఢిల్లీ, జూన్ 9:** గత కొన్ని వారాలుగా 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వార్తల్లో నిలిచిన తర్వాత, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ కట్జూ 'ఇష్క్ కరో పార్టీ (ఐకెపి) అనే ఒక కొత్త పార్టీని స్థాపించారు. "దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చేపట్టే ఒక ప్రయత్నం" అని కట్జూ పేర్కొన్నారు. తన కొత్త పార్టీలో చేరాలని తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రాకు కట్జూ ఆహ్వానం పంపారు. మరోవైపు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించిన నీట్ వంటి పోటీ పరీక్షలలో లోపాల కారణంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడిని 'మూర్ఖుడు' అని పేర్కొంటూ కట్జూ తన 'ఎక్స్' ఖాతాలో విమర్శలు గుప్పించారు. తమ పార్టీని కేవలం ఒక జోక్ గానో లేదా "అబ్బాయిలు, అమ్మాయిల మధ్య ప్రేమను ప్రోత్సహించే వాలెంటైన్స్ డే లాంటిది"గానో ప్రజలు పొరబడే అవకాశం ఉందని జస్టిస్ కట్జూ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "కానీ అది పూర్తిగా అపోహ మాత్రమే" అని ఆయన అన్నారు. ప్రజల మధ్య 'ఐక్యత' ద్వారా భారతదేశంలోని పేదరికం, పిల్లలలో పోషకాహార లోపం, నిరుద్యోగం, ఇతర సమస్యలను నిర్మూలించవచ్చని ఆయన తెలిపారు. "కులం, మతం, జాతి వంటి భేదాలు లేకుండా మన ప్రజలందరి పట్ల మనం ప్రేమను (ఇష్క్) కలిగి ఉండాలి. అప్పుడే ఆధునిక దృక్పథం కలిగిన నాయకుల నేతృత్వంలో, ప్రజల దయనీయ పరిస్థితుల నుండి విముక్తి కోసం మనం ఒక బలమైన ప్రజా పోరాటాన్ని (జన్ సంఘర్ష్) నిర్వహించగలము" అని ఆయన ఎక్స్‌లో రాసుకొచ్చారు. రాజకీయ నాయకులు కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నారని, ప్రజల పట్ల వారికి "నిజమైన శ్రద్ధ" లేదని ఆయన ఆరోపించారు. "ఈ దుస్థితిని ఎదుర్కోవడం, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడం ఐకెపి లక్ష్యం. కులం, మతం, జాతి వంటి భేదాలు లేకుండా మన ప్రజలందరి పట్ల మనం ప్రేమను (ఇష్క్) కలిగి ఉండాలి" అని ఆయన అన్నారు.

దీప్కేపై కట్జు విమర్శలు: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 6న బొద్దింకల జనతా పార్టీ తన మొదటి నిరసనను చేపట్టిన నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతో ఎలాంటి మార్పు రాదని చెబుతూ, ఆ పార్టీ సిద్ధాంతాన్ని, దాని వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై కట్జు విమర్శలు గుప్పించారు. "భారత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది అభిజిత్ దీప్కే ప్రధాన డిమాండ్లలో ఒకటి కావడమే అతను ఒక మూర్ఖుడని చెప్పడానికి స్పష్టమైన నిదర్శనం. కానీ ఆయన రాజీనామా చేస్తే, ఆయన స్థానంలో మరో మంత్రిని నియమిస్తారు.



# మహాయుతిలో శివసేన షిండేకు అవమానం!

**ముంబయి,జూన్ 9:** మహారాష్ట్ర అధికార మహాయుతి కూటమిలో అంతర్గత విభేదాలు మరోసారి రోడ్డున పడ్డాయి. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన ఒక హైప్రొఫైల్ కార్యక్రమ ఆహ్వాన పత్రిక వివాదం కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. మహారాష్ట్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన 20 అడుగుల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఏక్‌నాథ్ షిండేను ఆహ్వానించకపోవడం రాజకీయంగా దుమారం రేపింది. ఈ విమానాశ్రయ ప్రాజెక్టును పర్యవేక్షించే సీఐడీసీవో సంస్థ నేరుగా షిండే మంత్రిత్వ శాఖ పరిధిలోనే పని చేస్తుండటం గమనార్హం. అదానీ ఎయిర్‌పోర్ట్ అథారిటీ, సీఐడీసీవో సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గణేశ్ నాయక్, అదితి తత్కరేలు పాల్గొన్నప్పటికీ డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, సునేత్రా పవార్‌లను కనీసం సంప్రదించకుండా, ఆహ్వాన జాబితా నుంచి పూర్తిగా పక్కన పెట్టడం కలకలం సృష్టించింది. దీనిపై షిండే నేతృత్వంలోని శివసేన వర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కొందరు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి పనిచేస్తున్నారని, ప్రాజెక్టు క్రెడిట్ షిండేకు దక్కకుండా చేసేందుకే ఈ కుట్ర పన్నారని రాష్ట్ర మంత్రి సంజయ్ శిర్సాత్ బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. మరోవైపు ఈ వివాదం ప్రతిపక్షాలకు మంచి అస్త్రంగా మారింది. శివసేన నేత అంబాదాస్ దాన్వే అధికార కూటమిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# అఫ్ఘానిస్థాన్‌పై పాక్ దాడి

## ఆ దేశ సార్వభౌమాధికారంపై పోరాటం

### ఐక్యరాజ్యసమితిలో భారత్‌ప్రతినిధి హరీష్ పర్వతనేని ధ్వజం

**న్యూయార్కు, జూన్ 9:** అఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ సైన్యం జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఈ చర్య అఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన స్పష్టమైన దాడి అని, ఇది ఆ దేశంతో పాటు యావత్ ప్రాంతీయ శాంతికి పెను ముప్పు అని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస సర్వసభ్య సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి, అంబాసిడర్ హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ పాకిస్థాన్ దాడుల్లో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అఫ్ఘనిస్థాన్‌లోని ఐక్యరాజ్యసమితి సహాయ మిషన్ (యూఎన్ఏఎంఏ) నివేదికలను ఆయన ఉటంకించారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 372 మంది పౌరులు మరణిం చారని, మరో 397 మంది గాయపడ్డారని తెలిపారు. వీరిలో అత్యధికులు పవిత్ర రంజాన్ మాసంలోనే లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల్లో మరణించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఇదే సమావేశంలో ఐక్యరాజ్యసమితి నివేదికల విశ్వసనీయతను పాకిస్థాన్ ప్రశ్నించడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. బహుళ పక్షవాదం, ఐక్యరాజ్యసమితి పట్ల మద్దతు అనేది ఎవరి ఇష్టానుసారం వారు ఎంచుకునే మెనూ కాదు. మీకు నచ్చినప్పుడు దాన్ని స్వీకరించి, నచ్చనప్పుడు తిరస్కరించడం కుదరదని పర్వతనేని పాకిస్థాన్‌కు తీవ్ర స్థాయిలో హితవుపలికారు. ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వం కోసం యూఎన్ఏఎంఏ చేస్తున్న కృషికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలను, ముఖ్యంగా అంతర్జాతీయ మానవతా చట్టాలను గౌరవించాలని, పౌరుల రక్షణను నిర్ధారించాలని ఐరాస సెక్రటరీ జనరల్ చేసిన పిలుపును భారత్ సమర్థిస్తోందని పర్వతనేని తెలిపారు. ఈ దాడులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని యూఎన్ఏఎంఏ చేసిన డిమాండ్‌కు భారత్ మద్దతు తెలుపుతోందని ఆయన వివరించారు. ఇటువంటి దారుణమైన హింసాత్మక చర్యలు ఆమోదయోగ్యం కావని భారత్ స్పష్టం చేసింది.

# హెచ్1బి వీసా ఫీజును రద్దుచేసిన బోస్టన్ కోర్టు!




**బోస్టన్,జూన్ 9:** అమెరికాలో ఉద్యోగాలు ఆశిస్తున్న భారతీయ టెక్ నిపుణులతో పాటు ఇతర విదేశీ నిపుణులకు భారీ ఊరట లభించింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హెచ్1బీ వీసాలపై విధించిన లక్ష డాలర్లు సుమారు రూ. 95.8 లక్షలు భారీ ఫీజును అమెరికా ఫెడరల్ కోర్టు రద్దు చేసింది. ఈ ఫీజు పెంపు చట్టవిరుద్ధమైన పన్ను కిందకు వస్తుందని, కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు ఇలాంటి పన్ను విధించలేరని బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు స్పష్టం చేసింది. ట్రంప్ సర్కారుగత ఏడాది ప్రకటించిన ఈ ఫీజును సవాలు చేస్తూ డెమొక్రాటిక్ పార్టీకి చెందిన 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ కోర్టులో దావా వేశారు. దీనిపై విచారణ జరిపిన యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరోకిన్ తీర్పు ఇచ్చారు. "చట్టం ద్వారా కాంగ్రెస్ అధికారం ఇస్తే తప్ప, పన్ను విధించే అధికారం అధ్యక్షుడికి లేదు. హెచ్1బీ పిటిషన్లపై విధించిన ఈ ఫీజు కాంగ్రెస్ అనుమతి లేని పన్ను అని కోర్టు నిర్ధారించింది. అందువల్ల ఈ విధానాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటిస్తూ, పూర్తిగా రద్దు చేస్తున్నాం" అని తీర్పులో వెల్లడించారు. ఈ ఫీజు పెంపు వల్ల హెచ్1బీ వీసా దరఖాస్తులు భారీగా పడిపోయినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో 3,43,981గా ఉన్న హెచ్1బీ రిజిస్ట్రేషన్లు, 2027 ఆర్థిక సంవత్సరానికి 2,11,600కి పడిపోయాయి. దాదాపు 38.5 శాతం తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నాటికి కేవలం 85 మంది మాత్రమే లక్ష డాలర్ల ఫీజు చెల్లించినట్లు ప్రభుత్వం మార్చిలో కోర్టుకు తెలిపింది. సాధారణంగా హెచ్1బీ వీసా కోసం కంపెనీలు 2,000 నుంచి 5,000 డాలర్ల వరకు ఫీజు చెల్లిస్తాయి. అమెరికన్ ఉద్యోగుల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోవడానికి హెచ్1బీ కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ విధానం వల్ల దేశ ఆర్థిక, జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతోందని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను మెరుగుపరిచే క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయని, కేవలం భారత్‌ను లక్ష్యంగా చేసుకున్నది కాదని రూబియో వివరించారు. దేశంలో వలసల సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

# ఇరాన్‌పై నిరంతర దాడులు చేస్తే ఇజ్రాయెల్ ఒంటరికాక తప్పదు!

## నెతన్యాహుకు ట్రంప్ హెచ్చరికలు

**వాషింగ్టన్, జూన్ 9:** ఇరాన్‌పై నిరంతరం దాడులు చేస్తూ ఉద్రిక్తతలు పెంచితే అంతర్జాతీయంగా ఇజ్రాయెల్ ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో జరిపిన ఫోన్ సంభాషణల్లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి వాషింగ్టన్ ప్రయత్నిస్తున్న తరుణంలో, ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక దాడులు అమెరికా వ్యూహాలకు అడ్డంకిగా మారడమే ఈ హెచ్చరికకు ప్రధాన కారణం. వారాంతంలో లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ దాదాపు 30 బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించింది. దీనికి బదులుగా ఇజ్రాయెల్ కూడా ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, పెట్రోకెమికల్ కేంద్రాలపై దాడులు చేసింది. ట్రంప్ జోక్యంతో ఇరుదేశాలు ప్రస్తుతానికి దాడులను నిలిపివేశాయి. ఇరాన్‌పై మరింత పెద్ద ఎత్తున దాడులు చేయాలన్న నెతన్యాహు ప్రణాళికను ట్రంప్ జోక్యం చేసుకుని విరమింపజేశారు. బీబీ (నెతన్యాహు), నువ్వు జాగ్రత్తగా ఉండాలి లేకపోతే త్వరలోనే నువ్వు ఒంటరిగా పోరాడాల్సి వస్తుందని తాను హెచ్చరించినట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఇరుపక్షాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నందున ఇక యుద్ధాన్ని ఆపాలని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు నెతన్యాహు మాత్రం తమ సరిహద్దు రక్షణ కోసం, ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడానికి ఈ దాడులు తప్పనిసరని సమర్థించుకున్నారు. అమెరికా రక్షణ దళాలు ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడంలో సహాయపడినప్పటికీ, ఇజ్రాయెల్ చేస్తున్న ఎదురు దాడుల్లో మాత్రం నేరుగా పాల్గొనలేదు.

# జైపూర్‌లోని బాణసంచా గిడ్డంగిలో అగ్నిప్రమాదం

## చిన్నారి సహా ఏడుగురు మృతి - మరో నలుగురి పరిస్థితి విషమం



**జైపూర్, జూన్ 9:** జైపూర్‌లోని ఖోహ్ నాగోరియన్ ప్రాంతంలో మంగళ వారం ఒక అక్రమ బాణసంచా గిడ్డంగిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించి, ఒక చిన్నారితో సహా ఏడుగురు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఖోహ్ నాగోరియన్‌లోని ఐటీఐ కళాశాల సమీపంలో ఉన్న అయేషా నగర్ తలై ప్రాంతంలోని ఒక గిడ్డంగిలో ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని బర్న్ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఆర్.కె. జైన్ మాట్లాడుతూ, నలుగురి పరిస్థితి విషమంగా ఉందని, కాలిన గాయాలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. జైపూర్ పోలీస్ కమిషనర్ సచిన్ మిట్టల్ మాట్లాడుతూ, ఆ గిడ్డంగిని బాణసంచా నిల్వ చేయడానికి ఉపయోగిస్తున్నారని, అసలు ఫ్యాక్టరీ కొద్ది దూరంలోనే ఉందని ధ్రువీకరించారు. నివాస ప్రాంతంలో గిడ్డంగిని అక్రమంగా నడుపుతున్నారని, యజమాని, ఇంటి యజమాని, బాధ్యులుగా తేలిన పోలీసులపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

# అణు క్షిపణులను మోహరించిన భారత్!



**న్యూఢిల్లీ,జూన్ 9:** భారతదేశ రక్షణ, అణు ఆయుధ విధానంలో చరిత్రాత్మక మార్పు చోటుచేసుకున్నది. రక్షణ రంగ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా భారత్ ప్రయో గించేందుకు సిద్ధంగా ఉండేలా 12 అణు బాంబులను మోహరించినట్లు అంతర్జాతీయ ఆయుధాల పర్యవేక్షణ సంస్థ స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సిప్రీ తన నివేదికలో వెల్లడించింది. దశాబ్దాలుగా అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాన్ని పక్కనబెట్టి భారత్ ఈ అడుగు వేయడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా శాంతి సమయాల్లో భారత్ తన అణుబాంబులను, వాటిని ప్రయోగించే క్షిపణులు లేదా యుద్ధ విమానాలను వేర్వేరు ప్రాంతాలలో భద్రపరుస్తుంది. కానీ ఇప్పుడు తొలిసారిగా అణుబాంబులను నేరుగా ప్రయోగించే వ్యవస్థలతో అనుసంధానించి, సైనిక స్థావరాల్లో లేదా భూగర్భ క్షిపణి కేంద్రాల్లో యుద్ధానికి సిద్ధంగా ఉంచినట్లు సిప్రి నివేదిక పేర్కొంది.

# రెబెల్ ఎమ్మెల్యేలు,ఎంపిలపై టిఎంసినేత కల్యాణ్‌బెనర్జీ ధ్వజం

**కోల్‌కత్తా, జూన్ 9:** పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుత పరిణామాలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పందించింది. టీఎంసీ చీఫ్ విప్‌గా నియమితులైన కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ, గతంలో మమతా బెనర్జీ నాయకత్వాన్ని ఆకాశానికెత్తిన వారే, ఇప్పుడు పార్టీ అధికారంలో లేదనే సాకుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది కేవలం అధికారం కోసం చేస్తున్న ద్రోహమని ఆయన ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు, పార్లమెంటులో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసినట్లు రెబెల్ ఎంపీ కకోలీ ఘోష్ దస్తిదార్ ప్రకటించారు. రాష్ట్రంలో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో అసమ్మతి జ్వాలలు మిన్నంటాయి. ఇప్పటికే 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు పార్టీ అధికారిక శాసనసభాపక్ష నేత అభ్యర్థిని కాదని, బహిష్కరణకు గురైన నేతకు మద్దతు తెలపడం గమనార్హం. తాజాగా ఈ సంక్షోభం పార్లమెంటుకు సైతం పాకింది.

# సంక్షిప్తంగా..

## కేరళ మాజీ సిఎం విజయన్ కుమార్తె వీణకు ఇడి సమన్లు

**కొచ్చిన్, జూన్ 9:** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణకు ఈడీ సమన్లు జారీచేసింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ అక్రమ లావాదేవీల్లో ఆమె ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలు రావడంతో కంపెనీల చట్టం ఉల్లంఘన కింద అభియోగాలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కొచ్చి కార్యాలయం ముందు హాజరవ్వాలని ఈడీ ఆదేశించింది. వీణతోపాటు సిఎంఆర్ఎల్‌కు సంబంధించిన మరో తొమ్మిది మందికి సమన్లు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈడీతో కీలక పత్రాలను పంచుకోవడానికి నిరాకరిస్తూ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌ను కార్పొరేట్ నేరాలను విచారించే ప్రత్యేక న్యాయస్థానం తిరస్కరించింది.

ఈ క్రమంలోనే ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది.

ఈ దర్యాప్తులో భాగంగా ఇప్పటికే పలు డాక్యుమెంటరీ, డిజిటల్, ఆర్థిక ఆధారాలను సేకరించినట్లు అధికారులు వెల్లడించారు.

## సన్నీలియోన్‌కు సిఐడి నోటీసులు



**ముంబయి,జూన్ 9:** బాలీవుడ్ హాట్ బ్యూటీ సన్నీ లియోన్ ఒక భారీ ఆర్థిక వివాదంలో చిక్కుకోవడం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. కర్ణాటకకు చెందిన శివమ్ అసోసియేట్స్ అనే సంస్థ దాదాపు రూ.2,400 కోట్ల మేర అక్రమ డిపాజిట్లు సేకరించి, ప్రజలను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ సంస్థ యజమాని శివానంద నీలణ్ణవర్‌పై ఇప్పటికే కేసులు నమోదు కాగా, ఈ అక్రమ సొమ్ము వ్యవహారంలో సన్నీ లియోన్‌కు కర్ణాటక సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. శివమ్ అసోసియేట్స్ అధినేత 2023లో ఛాంపియన్ అనే సినిమాను నిర్మించాడు. ఈ చిత్రంలో ఒక ఐటెం సాంగ్ చేసినందుకు సన్నీ లియోన్‌కు ఏకంగా రూ.1 కోటి పారితోషికం ఇచ్చినట్లు బ్యాంక్ రికార్డుల ద్వారా అధికారులు గుర్తించారు.

## హర్ముజ్ జలసంధిలో కుప్పకూలిన హెలికాప్టర్

**టెహ్రాన్, జూన్ 9:** అమెరికా సైన్యానికి చెందిన అపాచీ హెలికాప్టర్ సోమవారం హర్మూజ్ జలసంధి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారని, వారికి ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ధృవీకరించారు. న్యూయార్క్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ట్రంప్, "పైలట్లు క్షేమంగా ఉన్నారు, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక నివేదికను విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ప్రపంచం చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన ప్రాంతం.

## అన్నామలై 'వియ్ ది లీడర్స్' ఉద్యమానికి అనూహ్య స్పందన

**చెన్నై,జూన్ 9:** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై ప్రారంభించిన వి ది లీడర్స్ ఉద్యమానికి ప్రజాక్షేత్రంలో అనూహ్య స్పందన లభిస్తోంది. ఈనెల 5న ప్రారంభమైన ఈ ఉద్యమంలో కేవలం మూడు రోజుల వ్యవధిలోనే సుమారు 17 లక్షల మంది సభ్యులుగా చేరారని అన్నామలై ప్రకటించారు. ఈ భారీ సభ్యత్వ నమోదు ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమిళనాడులో సమూల రాజకీయ మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు అన్నామలై తన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనను బట్టి వారు మార్పును ఎంత బలంగా ఆకాంక్షిస్తున్నారో స్పష్టమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఇజ్రాయెల్ గడ్డపై ఛత్రపతి శివాజీ విగ్రహం



**టెల్ అవీవ్,జూన్ 9:** మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ కీర్తిప్రతిష్టలు మరోసారి ప్రపంచవ్యాప్తం కానున్నాయి. ఇజ్రాయెల్‌లో శివాజీ మహారాజ్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముంబైలోని ఆ దేశ కాన్సులేట్ జనరల్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా యూదులు శతాబ్దాలుగా హింసను ఎదుర్కొన్నప్పటికీ భారత్‌లో మాత్రం వారు ఎలాంటి వివక్ష లేకుండా సురక్షితంగా జీవించారనే చారిత్రక బంధానికి ప్రతీకగా ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కొంకణ్ తీర ప్రాంతంలో నివసించే బెనె ఇజ్రాయెల్ అనే యూదు సమాజానికి, మరాఠా సామ్రాజ్యానికి మధ్య 17వ శతాబ్దం నుంచే బలమైన సైనిక బంధం ఉంది. యూదుల యుద్ధ నైపుణ్యాలను, వారి పట్టుదలను గుర్తించిన శివాజీ మహారాజ్ వారిని తన సైన్యంలో, నౌకాదళంలో కీలక పదవుల్లో నియమించారు.

## 'విశాఖ స్టీల్ ప్లాంటు ప్రమాదాన్ని రాజకీయం చేయడం సమంజసం కాదు'

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ స్టీల్ ప్లాంటు ప్రమాదాన్ని రాజకీయం చేయడం సమంజసం కాదని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ వ్యాఖ్యానించారు. విపత్కర పరిస్థితులకు అందరం బాధితులకు అండగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో తిరుపతిలో జరగాల్సిన కార్యక్రమాన్ని రద్దు చేశామని ఆయన వివరించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ బాధితులకు వైద్యం, సహాయ చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌తోపాటు మంత్రులు ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి పి.నారాయణ చెప్పారు. విశాఖ ఘటనపై వైసిపి అనవసర రాజకీయాలు చేస్తోందంటూ మండిపడ్డారు. వైసిపి శవ రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలని ఆ పార్టీ నేతలకు మంత్రి నారాయణ హితవు పలికారు. 2029 ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు 56 మంది ఫిర్యాదుదారులు వచ్చారని మంత్రి పి.నారాయణ వివరించారు. ఈ ఫిర్యాదుల్లో 60 శాతానికిపైగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అవకతవకల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై సిఎం చంద్రబాబు వారానికి ఒకసారి సమీక్ష నిర్వహిస్తున్నారని వివరించారు. రెవెన్యూ అంశాల పరిష్కారానికి మంత్రుల కమిటీ పని చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ గుర్తు చేశారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా కలెక్టర్లు, అధికారులకు పంపించామని మంత్రి నారాయణ తెలిపారు. ఇక పెన్షన్లు, మున్సిపల్ సమస్యలు, కుటుంబ వివాదాలపై కూడా ఫిర్యాదులు అందాయని వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి నేరుగా జిల్లా కలెక్టర్లతోపాటు కమిషనర్లతో మాట్లాడామని మంత్రి నారాయణ చెప్పారు.

## 'జగన్ అసత్యప్రచారాలు మానుకోవాలి'

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం వైఎస్ జగన్ అసత్యప్రచారాలు మానుకోవాలని రాజ్యసభ సభ్యుడు, టిడిపి నేత సానా సతీష్ అన్నారు. వైసిపి అధినేత జగన్ మహిళా సమస్యలపై చేసిన వ్యాఖ్యలపై సానా సతీష్ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసారు. సొంత తల్లిని, చెల్లిని వెన్నుపోటు పొడిచిన జగన్, మహిళల గురించి మాట్లాడటం అత్యంత విడ్డూరంగా, నైతికత లేని చర్యగా ఉందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన కొన్ని వాస్తవాలను సానా సతీష్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైసిపి అధికారంలో ఉన్న కాలంలో జగన్ 11 మందిని రాజ్యసభకు నామినేట్ చేశారని, అయితే ఆ 11 సీట్లలో ఒక్కటంటే ఒక్క సీటు కూడా మహిళకు కేటాయించలేదని ఆయన ధ్వజమెత్తారు. తల్లి వైఎస్ విజయమ్మ విశాఖపట్నం లోక్‌సభ స్థానంలో ఓడిపోయేలా చేశారని, ఆ తర్వాత ఆమెతో బలవంతంగా పార్టీ నుంచి రాజీనామా చేయించారని ఆరోపించారు. పెయిడ్ మీడియా ద్వారా మహిళలపై విషపూరిత ప్రచారాలు చేయించడమే జగన్ నైజమని విమర్శించారు. "తన సొంత తల్లిని, చెల్లిని మోసం చేసిన వ్యక్తి, ఇక రాష్ట్రంలోని మహిళల సంక్షేమం గురించి ఎలా మాట్లాడగలరు?" అని సతీష్ నిలదీశారు. ఇదే సమయంలో మహానాడు వేదికగా మంత్రి నారా లోకేష్ రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. లోకేష్ తీసుకున్న ఈ నిర్ణయం జగన్‌ను తీవ్రమైన ఆత్మరక్షణలో పడేసిందని, ఇప్పుడు ఆయనకు ఏం చేయాలో పాలుపోని నిస్సహాయ స్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు.

## నేడు విశాఖకు వైసిపి అధినేత వైఎస్ జగన్

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ ఈ నెల 10 బుధవారం పరామర్శించనున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఆసుపత్రిలో వైఎస్ జగన్ పరామర్శిస్తారు. బాధిత కుటుంబాలను కలువనున్నారు.

## బీహార్ బస్సు ఘటనలో మృతిచెందిన ముగ్గురి భౌతిక కాయాల నెల్లూరుకు తరలింపు

### వివరాలు వెల్లడించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**నెల్లూరు(వైద్యం), జూన్ 9 ప్రభాతవార్త:** బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల భౌతిక కాయాలను వారి స్వస్థలాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి మృతదేహాలను ఔరంగాబాద్ నుండి పాట్నాకు తరలించిన అనంతరం, ఇండిగో విమానం 6ఇ619 ద్వారా హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ఇండిగో విమానం 6ఇ6174 ద్వారా చెన్నైకి తరలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విమానం నేడు రాత్రి 10.05 గంటలకు చెన్నై టెర్మినల్1కు చేరుకోనుందని పేర్కొన్నారు. మృతదేహాలతో పాటు సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న సోమా పెంచల ప్రసాద్ ప్రయాణిస్తున్నారని తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో మృతదేహాలను స్వీకరించి, అక్కడి నుంచి సురక్షితంగా నెల్లూరు జిల్లాకు తరలించి సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. అలాగే ప్రమాదంలో గాయపడిన యాత్రికులకు వైద్య సేవలు, స్వస్థలాలకు తరలింపు కార్యక్రమాలను కూడా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు.

## సహకార రంగం బలోపేతానికి సహకార భూమి



**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సహకారరంగం బలోపేతానికి సహకారభూమి పత్రిక అండగా ఉంటుందని ఆప్కాబ్ ఛైర్‌పర్సన్ గన్ని వీరాంజనేయులు కొనియాడారు. సహకారభూమి పత్రిక మూడవ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను మంగళవారం విజయవాడలోని సహకారభూమి జర్నల్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో వీరాంజనేయులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకారభూమి పత్రిక వ్యవసాయంతోపాటు సహకారవేత్తలు, సీనియర్ జర్నలిస్టులు, సంఘాలు ఏవిధమైన ప్రయోజనాలు ఆశించకుండా సహకార ఉద్యమం సజీవంగా ఉండాలని దాని విలువలు సమాజానికి తెలియచేయాలనే లక్ష్యంతో ఈపత్రికను నిర్వహిస్తున్నారని కొనియాడారు. సహకార రంగానికి సంబంధించిన సమాచారం, చరిత్ర, విలువలు, విజయగాథలను ప్రజలకు చేరవేస్తూ ఈపత్రిక ఒక ఉద్యమంలా పనిచేస్తుందన్నారు. సహకార రంగం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ఇందులోని విజయాలు, సవాళ్లు ప్రజలకు తెలియచేసేందుకు ఇటువంటి పత్రికల అవసరం ఉందన్నారు. ఈపత్రికకు అన్ని విధాల మద్దతు అందించేదే అంశాన్ని ఆప్కాబ్, జిల్లాకేంద్రసహకారబ్యాంకులు, పిఏసిఎస్‌ల స్థాయిలో పత్రిక విస్తరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆప్కాబ్ జనరల్‌బాడీ సమావేశంలో చర్చించి పత్రిక అభివృద్ధికి సహకరిస్తామని చైర్మన్ ప్రకటించారు. పత్రికను డిజిటల్ రూపంలోనూ అందుబాటులోకి తేవాలని, ఇందుకు రూ.50వేలు, పత్రిక కార్యాలయం నిర్వహణకు రూ.10వేలు వ్యక్తిగత విరాళం ప్రకటించిన వీరాంజనేయులు ఈమొత్తాన్ని పత్రిక నిర్వాహకులకు అందచేసారు. ఈకార్యక్రమంలో ఆప్కాబ్ యండి ఆర్.ఎస్.రామకృష్ణ, నాబార్డ్ ప్రతినిధి చంద్రమౌళి, వెటరన్ జర్నలిస్ట్ వడ్డమూడి పద్మావతి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ కార్యదర్శి చావా రవి, జర్నలిస్టుల దాసరి కేశవులు, ఖాన్ రవీంద్ర, జి.వి.రంగారెడ్డి, ప్రసాదరెడ్డి, టి.వి.నరసింహారావు, దుర్గారావు స్వాతి, డి.రామారావు, వై.శ్రీనివాసరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గరివిడి పశువైద్య కళాశాలకు విసిఐ అనుమతి నో

- ఇంటర్ షిప్ విద్యార్థులకు గన్నవరం, ప్రొద్దుటూరు, తిరుపతి కళాశాలలకు తరలింపు
- త్వరలో పరిశీలనకు రానున్న వెటర్నరీ కౌన్సిల్ బృందం

**గరివిడి(విజయనగరం జిల్లా), జూన్ 9 ప్రభాతవార్త:** గరివిడి పశువైద్య కళాశాలకు ఈ ఏడాది కూడా వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (న్యూ ఢిల్లీ) అనుమతులు లభించలేదు. గతేడాది మాదిరిగానే ఇక్కడ ఇంటర్ షిప్‌కి వెళ్లే 70 మంది విద్యార్థులకు పశు వైద్య మండలి అనుమతులతో నిర్వహిస్తున్న తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలకు విద్యార్థులను తరలించారు. గరివిడి పశువైద్య కళాశాల ఏర్పడి ఏళ్ళు గడుస్తున్నా ఇక్కడి కళాశాలలో మౌలిక సౌకర్యాలు లేమి, ఆపై తగినంత మంది బోధనా సిబ్బంది లేకపోవడంతో గత మూడు దఫాలుగా పరిశీలనకు విచ్చేసిన విసిఐ బృందం అనుమతులు మంజూరు చేయలేదు. న్యూ ఢిల్లీ నుండి వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం ఆగమనం సమయంలో తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలల నుండి డెప్యూటేషన్‌పై ప్రొఫెసర్లను తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం అధికారులు హుటాహుటిన గరివిడి కళాశాలకు పంపించడం, పరిశీలన అనంతరం మళ్ళీ ప్రొఫెసర్లను తిరిగి అదే కళాశాలలకు పంపించే నేపథ్యంలో విసిఐ బృందం అనుమతులు నిరాకరిస్తూనే ఉంది. గరివిడి పశువైద్య కళాశాలలో చదివే విద్యార్థుల భవితవ్యం దృష్ట్యా గత ఏడాది విద్యార్థులను ఇంటర్ షిప్ కోసం తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు పంపించారు. అక్కడ విద్యాభ్యాసం చేసినట్లుగా అనుమతులు కేంద్రం నుండి మంజూరు చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, ఇతర మంత్రులు, అధికారులతో సంభాషించి అనుమతులు పొందారు. ఈ ఏడాది కూడా గరివిడి పశువైద్య కళాశాలకు విసిఐ అనుమతులు రాకపోవడంతో అదే విధానాన్ని తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు అవలంభించి ఇక్కడి ఇంటర్ షిప్ విద్యార్థులను ఆ మూడు కళాశాలలకు పంపించారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా గరివిడి పశువైద్యకళాశాలకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు మంజూరు అయ్యేవిధంగా ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉంది. అలాగే గరివిడి కళాశాలలో విసిఐ అనుమతులు పొందేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు అవసరమైన ప్రొఫెసర్లను పూర్తి స్థాయిలో నియమించాల్సిన అవశ్యం ఎంతైనా ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. పశువైద్య విద్యార్థులు ప్రతీ ఏటా వేరే కళాశాలలకు ఇంటర్ షిప్‌కి వెళ్లే అవకాశం లేకుండా ప్రభుత్వం గరివిడి కళాశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, ఉన్నతాధికారులు కృషి చేస్తారని గంపెడాశతో గరివిడి పశువైద్య విద్యార్థులు నిరీక్షిస్తూ ఉన్నారు.

# అసోం వాసుల చెంతకు వెంకన్న

- స్థలం కేటాయింపుతో త్వరలో గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణం





**తిరుమల, జూన్ 9 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయాలను హిందువులు ఉన్న ప్రతిచోటా నిర్మించాలని, ఆధ్యాత్మిక వాతావరణంతోబాటు సనాతన ధర్మాన్ని విస్తరించాలని టిటిడి భావిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు దేశవ్యాప్తంగా రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణ కార్యక్రమం చేపడుతోంది. అసోం ప్రభుత్వం కేటాయించిన 10.33 ఎకరాల భూమిని మంగళవారం టిటిడి అధికారులు అధికారికంగా స్వాధీనం చేసుకున్నారు. అసోంలోని కామ్రూప్ జిల్లాలోని సోనాపూర్ సర్కిల్ పరిధిలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం ఈ భూమిని అసోం ప్రభుత్వం కేటాయించింది. గతంలో టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, టిటిడి ఉన్నతాధికారులు అసోం ప్రభుత్వ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి ఆలయ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టారు. చంద్రబాబు, టిటిడి పాలకమండలి కూడా అసోం ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో టిటిడి ఎస్టేట్ అధికారి సువర్ణమ్మ, ఇఇ సురేంద్ర రెడ్డికి అసోం మెట్రోపాలిటన్ డిప్యూటీ కమిషనర్ ల్యాండ్ పొజెషన్ సర్టిఫికెట్ అందజేశారు. త్వరలో గువహటిలో భూమిపూజ చేసి శ్రీవారి ఆలయ నిర్మాణానం చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ఈ ప్రక్రియ వేగవంతమై సఫలమవడం ఆనందదాయకమన్నారు. అసోం లో శ్రీవారి ఆలయ నిర్మాణం ఈశాన్య భారతం లో సనాతన ధర్మ ప్రచారానికి, ఆధ్యాత్మిక చైతన్య విస్తరణకు ఒక చారిత్రాత్మక మైలు రాయిగా నిలవనుందని ఛైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి బిశ్వ శర్మకి, అసోం ప్రభుత్వానికి టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర టిటిడి తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలి

**తిరుపతిలో వామపక్ష పార్టీల రాస్తారోకో**

**తిరుపతి, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పెట్రోల్, డీజిల్, సిఎన్‌జీ, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు మంగళవారం తిరుపతిలో రాస్తారోకో నిర్వహించారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుండి సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎస్‌యుసిఐ పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి పూర్ణకుంభం సర్కిల్ వద్దకు చేరుకుని రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, సిపిఐ నగర కార్యదర్శి జె. విశ్వనాథ్ అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రామానాయుడు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటరత్నం, సుసి పార్టీ కార్యదర్శి హరీష్ ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ 2014లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. ధరల నియంత్రణ, ఉపాధి కల్పన, ప్రజా సంక్షేమం పేరుతో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా నేడు సామాన్య ప్రజల జీవనం మరింత భారంగా మారిందని అన్నారు. "ఒకే దేశం – ఒకే పన్ను" అంటూ జీఎస్టీని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌ను మాత్రం జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాదని, రైతుల సాగు ఖర్చులు, రవాణా వ్యయం, కూరగాయలు, పండ్లు, పాలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి ప్రధాన కారణమవుతోందని తెలిపారు. దీంతో ప్రతి కుటుంబంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలే అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడంలో విఫలమయ్యాయని విమర్శించారు. వంటగ్యాస్ ధరలను తగ్గించి సబ్సిడీని పునరుద్ధరించాలని, ఆటో డ్రైవర్లు, రవాణా కార్మికులకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.మాధవ్, పి. సాయిలక్ష్మి, పి. బుజ్జి, పార్థసారథి, కేఆర్ఎస్ వాసు, సిపిఐ నాయకులు రాధాకృష్ణ, ఎన్.డి. రవి, చంద్రశేఖర్ రెడ్డి, శివ, నదియా, మంజుల, చలపతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో నూతన అన్నప్రసాద, లడ్డూపోటు

**ఇంద్రకీలాద్రి, జూన్ 9 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో నిర్మాణంలో వున్న నూతన అన్నప్రసాద భవనం, లడ్డూ పోటు భవనాలను ఇఒ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు మంగళవారం పరిశీలించారు. ఇఇ ఎల్ రమాదేవిని అడిగి పనుల పురోగతి తెలుసుకున్నారు. గడువులోగా పనులు పూర్తవ్వాలని ఆదేశించారు. దుర్గమ్మ ఆలయంలో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు భక్తులకందించే ఏర్పాట్లు ఖచ్చితంగా అమలు చేయాలని ఇఒ వికె శీనా నాయక్ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మంగళవారం ఆయన ఆలయ ప్రాంగణంలో పరిశీలన చేశారు. శివాలయం నుండి పూజా మండపం వద్దకు వచ్చే దారిలో అపరిశుభ్రత వుండడంతో వెంటనే పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఆలయంలోని పలు ప్రాంతాల్లో వున్న మంచినీటి పంపులను పరిశీలించి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చండీహోమం యాగశాల వద్ద భక్తులకు పలు సౌకర్యాలు కల్పించాలని, నిరంతరం ఆలయంలో దుర్గమ్మవారి నామస్మరణ వినిపించేలా చర్యలు తీసుకోవాలని, రు.500 టికెట్ భక్తులకు లడ్డూ ప్రసాదం ఉచితంగా అందుకునే ఏర్పాటుపై మైక్‌లో సూచనలందించాలని ఆదేశాలిచ్చారు.



ఇఒ, ఛైర్మన్లు నిర్మాణంలో వున్న భవనాలు పరిశీలిస్తున్న దృశ్యం

**వేదపాఠశాలలో ప్రవేశాలకు ఆసక్తులకు ఆహ్వానం:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరంకి వేదపాఠశాలలో వేదం, స్మార్త కోర్సుల్లో చేరగోరు విద్యార్థులకు 2026–27 విద్యా సంవత్సరానికి నూతన ప్రవేశ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఋగ్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం, ఆపస్తంబ పౌరోహిత్య, స్మార్త విద్య కోర్సులు బోధిస్తామన్నారు. విధిగా ఉపనయనం జరిగి నిత్య సంధ్యావందనం చేస్తూ, తెలుగు చదవగలిగిన బాలురకు ప్రవేశార్హతలన్నారు. అలాగే 10 నుండి 12 వయస్సు విద్యార్థులకు వేదవిద్య ప్రవేశానికి, 10 నుండి 13 వయస్సు విద్యార్థులకు స్మార్త విద్యకు అర్హులన్నారు. విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి, వస్త్రాలు, వైద్య సదుపాయాలతో పాటు కోర్సు పూర్తి చేసి తుది పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి యోగ్యతాపత్రంతో పాటు రు.3లక్షల స్టైఫండ్ అందిస్తామన్నారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన గుండా కృష్ణ కార్తీక్ మంగళవారం రు.1,01,116ల విరాళమందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## నెల్లూరులో వివాహిత దారుణ హత్య

**నెల్లూరు క్రైం, జూన్ 9 ప్రభాతవార్త:** నగర శివారులోని పడారుపల్లి చెరువు కట్ట వద్ద మంగళవారం జరిగిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో చోటుచేసుకున్న గొడవ, ఒక మహిళ ప్రాణాలను బలితీసుకుంది. తనను మోసం చేసిందన్న అనుమానంతో ప్రియుడే అత్యంత దారుణంగా ఆమెను కత్తితో పొడిచి చంపాడు. సేకరించిన సమాచారం మేరకు కనుపర్తిపాడు గ్రామానికి చెందిన రేవంతి (35)కి, సుమన్ అనే వ్యక్తితో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే, భర్తతో వచ్చిన మనస్పర్ధల కారణంగా ఆమె గత కొంత కాలంగా పిల్లలతో కలిసి కనుపర్తిపాడులోనే ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో స్థానికుడైన కడప శ్రీకాంత్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాలక్రమంలో వివాహేతర సంబంధానికి దారితీసింది. కొంతకాలం సజావుగా సాగిన వీరి బంధంలో రెండు నెలలుగా విభేదాలు మొదలయ్యాయి. రేవంతి మరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతోందని, ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చిందని శ్రీకాంత్ అనుమానించేవాడు. ఈ విషయమై వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగు తుండేవి. తనను మోసం చేస్తోందన్న కోపంతో రేవంతిని అంతం చేయాలని శ్రీకాంత్ పథకం రచించాడు. మంగళవారం రేవంతి, శ్రీకాంత్ ఇద్దరూ నెల్లూరు నగరానికి కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో, పడారుపల్లి చెరువు కట్ట సమీపానికి రాగానే మళ్లీ ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కత్తితో శ్రీకాంత్ రేవంతిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య అనంతరం నిందితుడు శ్రీకాంత్ నేరుగా వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, తాను రేవంతిని హత్య చేసినట్లు అంగీకరిస్తూ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యోగా

**విజయవాడ, జూన్ 9, ప్రభాతవార్త :** నిత్యం ఎన్నో సమస్యలతో సతమత మవుతున్న ప్రజలు మానసిక ఒత్తిడి ని అధిమించేందుకు ప్రతిరోజూ 45 నిముషాలపాటు యోగాసనాలు వేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు. విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డులో మంగళవారం యోగాభ్యాసనలో ప్రజలు, అధికారులతో కలసి కలెక్టర్ పాల్గొని యోగాసనాలు వేసారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను బాగస్వామ్యం చేసుకోవాలన్నారు. యోగాసాధన వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించటంతోపాటు, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు.

## వృద్ధురాలికి తిరుపతి కలెక్టర్ సాయం



**తిరుపతి, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్ణాటక రాష్ట్రానికి చెందిన శారదమ్మ(75) దిక్కు తోచని స్థితిలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వేంకటేశ్వర్‌ను కలసింది. ఆ వృద్ధురాలి దీనస్థితిని గమనించిన కలెక్టర్ కొడుకుస్థానంలో సాయమందించారు. తనకు ఆశ్రయం కల్పించాలని కోరగా వెనువెంటనే మానవతా దృక్పథంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ఆమెకు ఆశ్రయం కల్పించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన పి.శారదమ్మ తన భర్తతో కలసి బళ్ళారి పట్టణంలోని ఆలయ పరిసరాల్లో చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం గడుపుకునేది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శారదమ్మ తన భర్త మరణించిన అనంతరం జీవనోపాధి లేక ఒంటరిగా మిగిలిపోయింది. దిక్కు తోచని స్థితిలో వేంకటేశ్వర స్వామి దిక్కని తలచి తిరుపతి నగరం చేరుకుంది. వృద్ధురాలి దయనీయ స్థితిని చూసిన పలువురు స్థానికులు జిల్లా కలెక్టర్ ను కలసి తన పరిస్థితిని వివరించాలని సూచించారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ ను కలిసిన వృద్ధురాలు తన భర్త మరణానంతరం తన ఇద్దరు పిల్లలు తనకు ఆశ్రయం కల్పించలేదని, దుర్భర పరిస్థితిలో తిరుపతి చేరుకున్నానని తెలిపింది. అనంతరం తిరుపతిలోని పలు వృద్ధాశ్రమాలను ఆశ్రయించగా తనకు ఆశ్రయం కల్పించడానికి వృద్ధాశ్రమాలు తిరస్కరించాయని తెలిపారు. పేద ప్రజల కష్టానికి చలించే జిల్లా కలెక్టర్ ఉన్నారని స్థానిక ప్రజల సూచనలతో తిరుపతి జిల్లా సచివాలయానికి చేరుకున్నానని, తనకు ఆశ్రయం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఆమె విన్నవించుకుంది. వృద్ధురాలి నిస్సహాయ పరిస్థితి, కన్నీటిని చూసిన జిల్లా కలెక్టర్ చలించి మానవతా దృక్పథంతో సహాయక చర్యలకు పూనుకున్నారు. వెంటనే బీ.టి.ఆర్. కాలనీలో ఉన్న రాష్ట్రీయ సేవా సమితి ప్రతినిధులను సంప్రదించి వృద్ధురాలిని వృద్ధాశ్రమంలో చేర్పించి ఆశ్రయం, వైద్యం, అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టాలని దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తక్షణమే ఆమెను రాష్ట్రీయ సేవా సమితి వృద్ధాశ్రమంలో చేర్పించారు. తనకు ఆశ్రయం కల్పించిన జిల్లా కలెక్టర్‌కు అధికారులకు ధన్యవాదాలు తెలిపింది. వృద్ధులు నిరాశ్రయుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

### 140 కేజీల గంజాయి, లారీ స్వాధీనం



**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త:** విజయవాడ పటమట పోలీసులు, రాష్ట్ర ఈగల్ బృందం సంయుక్తంగా మంగళవారం జరిపిన తనిఖీలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న లారీతో పాటు, రూ.70 లక్షల విలువైన 140 కేజీల గంజాయిని విజయవాడ పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు విజయవాడ, పటమట పోలీస్ స్టేషన్ పరిదిలోని నిడమానూరు ప్రాంతంలో పటమట ఇన్స్పెక్టర్పవన్ కిషోర్, ఈగల్ టీం ఇన్స్పెక్టర్ రవీంద్ర గారు వారి వారి సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఒక లారీని ఆపి వాహనాన్ని తనిఖీ చేయగా అందులో గంజాయి కలిగిన బ్యాగులను గుర్తించి డ్రైవరు ను అదుపులోనికి తీసుకున్నట్లు డి.సి.పి. కృష్ణ కాంత్ పటేల్,ఈగల్ ఎస్.పి. నగేష్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. తమిళనాడు, ధర్మపురి జిల్లా, హరూర్ ఏరియాకు చెందిన సెల్వం (39), పట్టుకోనంపట్టి ఏరియాకు చెందిన టి.ప్రదీప్ (36)ఇద్దరూ తమిళనాడులోని ఒక సరుకు రవాణా సంస్థలో లారీ డ్రైవర్లు గా పనిచేస్తున్నారు, వీరు ఒరిస్సాలో స్టీల్ కాయిల్స్ లోడ్ వేసుకుని వస్తుండగా శ్రీకాకుళం జిల్లా సమీపంలో ఒక వ్యక్తి సేల్వంతో మాట్లాడి గంజాయిని కోయంబత్తూరుకు రవాణా చేస్తే 30 వేల రూపాయలను ఇస్తామని చెప్పగా ఆ డబ్బులకు ఆశ పడిన డ్రైవర్ సెల్వం తనతోపాటు వస్తున్న మరో డ్రైవర్ ప్రదీప్ లారీలో లోడ్ వేయించి ఇద్దరూ ఒకరి వెనకాల మరొక లారీని నడుపుకుంటూ కోయంబత్తూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున నిడమానూరులో పోలీసులు లారీని ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. ఇద్దరు నింధితులను అదుపులోకి తీసుకుని సుమారు 7 లక్షల రూపాయల విలువైన గంజాయిని, గంజాయి తరలించడానికి ఉపయోగించిన ఒక లారీని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు డిసిపి తెలిపారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న ఒరిస్సా, గజపతి జిల్లాకు చెందిన ఆరూప్ సింగ్ (24), రాజేష్ కుమార్ సింగ్ (25), కేరళ, మళప్పురం జిల్లా కు చెందిన మొహమ్మద్ సోహెల్ (27) పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర డి.జి.పి., ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనర్, ఈగల్ టీంల పర్యవేక్షణలో గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు, సరఫరాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు వారు డి.సి.పి. తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏ.డి.సి.పి. ఎన్.బి.ఎం. మురళి కృష్ణ గారు, సెంట్రల్ ఏ.సి.పి. దామోదర్, పటమట ఇన్స్పెక్టర్ పవన్ కిషోర్, ఈగల్ ఇన్స్పెక్టర్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## 53 కిలోల గంజాయి పట్టివేత

### నిందితుడు అరెస్టు.. కారు, మొబైల్ సీజ్



**నల్లమాడ జూన్ 9 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండల పరిధిలోని పులగంపల్లి వద్ద మంగళవారం కారులో అక్రమంగా తరలిస్తున్న 53కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివనారాయణ, సిఐ శ్రీనివాసులు తెలిపారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, డి.ఎస్.పి శివన్నారాయణ ఆదేశాల మేరకు తమ ఆధ్వర్యంలో నల్లమడ ఎస్సై సతీష్, సిబ్బందితో కలిసి మంగళవారం పులగంపల్లి క్రాస్‌లో ప్రత్యేక నిఘ ఏర్పాటు చేశారు. కదిరి నుంచి ఓడిసి వైపు అనుమానస్పదంగా వెళుతున్న హుండాయ్ ఏపీ 39 ఎన్ఏ 7507 నెంబరు గల కారును తనిఖీ చేయగా కార్ డిక్కీలో 24 ప్యాకెట్లలో 53 కిలోల గంజాయి దాచి ఉండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కారు డ్రైవింగ్ చేస్తూ గంజాయి తరలిస్తున్న నల్లమాడ మండలం సి రెడ్డివారిపల్లికి చెందిన బి వెంకటరమణను అదుపులోకి తీసుకొని కారు, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో సిరెడ్డివారిపల్లికి చెందిన మల్లికార్జున ఆదేశాల మేరకు వెంకటరమణ గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు వారు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నందున తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని సిఐ వివరించారు.



దగ్ధమవుతున్న లారీలు

# ఘోర రోడ్డు ప్రమాదం

## డ్రైవర్ సజీవ దహనం

### అనంతపురం జిల్లా జాజరకల్లు టోల్ ప్లాజా వద్ద ఘటన

**డి.హీరేహాళ్, జూన్ 9 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా డి.హిరేహాళ్ మండలం జాజరకల్లు టోల్ ప్లాజా వద్ద 150 ఎ జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో రెండు లారీలు పూర్తిగా దగ్ధమైన లారీ డ్రైవర్ సజీవ దహనమైన సంఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రాయదుర్గం రూరల్ సిఐ వెంకటరమణ బొమ్మనహాళ్ ఎస్.ఐ. నబీ రసూల్తో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటన విషయమై సిఐ అందించిన వివరాల మేరకు ఈ ఘటనలో కంకర్ లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ దీక్షిత్ (32) మంటల్లో చిక్కుకుని సజీవ దహనం కాగా సిమెంట్ ట్యాంకర్ లారీ డ్రైవర్ ముత్తురాజ్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడని సిఐ చెప్పారు. కర్ణాటక చిత్రదుర్గం నుండి బళ్లారి సమీపంలోని జిందాల్ పరిశ్రమకు కంకరతో వెళుతున్న లారీ, జిందాల్ నుండి బెంగళూరుకు సిమెంట్ ట్యాంకర్తో వెళ్తున్న లారీ డీజిల్ ట్యాంకును కంకర్ లారీ ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుందని సిఐ తెలిపారు. ప్రత్యక్ష సాక్షుల అందించిన కథనం మేరకు కంకర్ లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్ర మత్తులో రాంగ్ రూట్లో వెళ్లి ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ డీజిల్ ట్యాంకును గుద్దడంతో ట్యాంకు పగిలి మంటలు చోటుచేసుకున్నాయని తెలిపారు.

ఈ ప్రమాదాన్ని గమనించిన సిమెంట్ ట్యాంకర్ లారీ డ్రైవర్ అప్రమత్తమై లారీ ఆపి దిగి పరిగెత్త డంతో ప్రాణాపాయంతప్పి స్వల్పగాయాలతో బయటపడడం జరిగిందని మంటల్లో సజీవదహనమైన మరణించిన లారీ డ్రైవర్కు భార్య, కూతురు ఉన్నారని సిఐ వివరించారు. కంకర్లారీ డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంతో లారీని నడపడమే ప్రమాదానికి కారణమైందని మంటల్లో సజీవ దహన మైన లారీ డ్రైవర్ కర్ణాటక హిరియూరు సమీపంలోని గౌడనహళ్లికి చెందినవ్యక్తని సిఐ చెప్పారు. రాయదుర్గం, బళ్లారి అగ్నిమాపక దళాలు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కృతి

>> రద్దు చేయాలని కోరుతూ బిజెపి నాయకులు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు ఇసి అధికారులు వెంటనే నిర్ణయం తీసేసుకున్నారు. కాంగ్రెస్ ఈ అభ్యంతరాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అది నిరాధారమైనదని పేర్కొంది. నటరాజన్ ఎలాంటి క్రిమినల్ కేసును ఎదుర్కోవడం లేదని, అందువల్ల బిజెపి పేర్కొన్న విషయాన్ని వెల్లడించాల్సిన అవసరం ఆమెకు లేదని ప్రతిపక్ష నాయకుడు ఉమాంగ్ సింఘర్, ఇతర పార్టీ నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ విషయం కేవలం ఒక కోర్టు నోటీసుకు మాత్రమే సంబంధించింది కానీ, అధికారికంగా నమోదైన క్రిమినల్ కేసుకు కాదని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఇసి మార్గదర్శకాల ప్రకారం, అభ్యర్థులు అధికారికంగా నమోదై, కోర్టులలో పెండింగ్లో ఉన్న క్రిమినల్ కేసులను మాత్రమే వెల్లడించాలి కానీ, సాధారణ న్యాయపరమైన నోటీసులను కాదని ఆ పార్టీ వాదిస్తోంది.

## నేడు ఢిల్లీకి సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 9, ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనుకు ఢిల్లీ వెళుతున్నారు. జూన్ 10,11వ తేదీల్లో సిఎం ఢిల్లీలో ఉండనున్నారు. 10వ తేదీ బుధవారం ఉదయం 11.30 గంటలకు గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి సిఎం చంద్రబాబు హాజరవుతారు. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో సిఎం చంద్రబాబు పాల్గొంటారు. 11వ తేదీ గురువారం రాష్ట్రపతి భవన్లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సీఎం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఢిల్లీనుంచి రాత్రి 9.00 గం.కు అమరావతి చేరుకుంటారు.

# భారీ ప్రణాళికలు

>> చేపట్టిన అర్బన్ ఇన్వెస్ట్మెంట్ విండ్కో వర్క్ షాపు వల్ల పట్టణ ప్రాంతాల అభివృద్ధికి హడ్కో అందిస్తున్న సాంకేతిక, ఆర్థిక మార్గదర్శకాలు ఎంతో దోహదపడతాయన్నారు.

రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ అందించేందుకు రూ.17,394 కోట్ల అంచనాతో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అమృత్ 1.0, అమృత్ 2.0, పథకాల ద్వారా ఇప్పటికే రూ.12,395 కోట్ల విలువైన పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కచ్చా డ్రైన్లను శాశ్వత డ్రైన్లుగా మార్చేందుకు దాదాపు రూ. 29,000 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. జనసాంద్రత ఆధారంగా హై, మీడియం,లో డెన్సిటీ ప్రాంతాలుగా విభజించి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో హై, మీడియం డెన్సిటీ ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను రూ.9,000 కోట్లతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన అర్బన్ క్లియరెన్స్ ఫండ్లో రాష్ట్రానికి లభించే రూ.3,600 కోట్లతో పాటు, రాష్ట్ర వాటాగా రూ.10,800 కోట్లను హడ్కో మరియు ఇతర బ్యాంకుల ద్వారా సమీకరించేందుకు 72 మున్సిపాలిటీలకు రీపేమెంట్ సామర్థం ఉంద న్నారు. మిగిలిన మున్సిపాలిటీల్లో రూ.5,000 కోట్ల విలువైన పనులను యాన్యుటీ మోడల్ద్వారా చేపట్టేందుకు ఆర్థిక శాఖఅనుమతి లభించినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగాఅవసరం లేకుండా మంచి రోడ్లు, డ్రైన్లను తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని ఇంజనీర్లు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నిజంగా అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లు పట్టణా ల్లోని డ్రైన్లలో పూడికతీత (సిల్ట్ క్లియరెన్స్) పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు.



మంగళవారం విశాఖలోని ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

# ఎన్నడూ చూడని విషాదం

>> కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.45.75 లక్షలు అందజేస్తామని వెల్లడించారు. బాధిత కుటుంబాల పిల్లల విద్యాభ్యాసం నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు.ప్రమాదంపై సమగ్ర విచారణ కోసం బొకరో స్టీల్ ప్లాంట్ కు చెందిన త్రిసభ్య కమిటీని నియమించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలులో జరిగిన లోపాలు, సాంకేతిక సమస్యలు వంటి అంశాలను అన్ని కోణాల్లో పరిశీలించి కమిటీ నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్లాంట్లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా పాటించడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారని తెలిపారు. పాత యంత్రాలు, దశాబ్దాల నాటి పరికరాలను ఆధునీకరించకుండా వినియోగించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కార్మికులు ఆరోపించారని చెప్పారు."నా వద్ద ఉన్న సమాచారం ప్రకారం గత 36 ఏళ్ల స్టీల్ ప్లాంట్ చరిత్రలో ద్రవ ఉక్కును మోసుకెళ్లే ల్యాడిల్ బకెట్ ఈ స్థాయిలో పేలిపోయి ఇంత మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన ఎప్పుడూ జరగలేదు. గతంలో కొన్ని చిన్నపాటి ప్రమాదాలు జరిగినా, ఈ తరహా పేలుడు ఇదే మొదటిసారి" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. చైనా, ఫ్రాన్స్ వంటి దేశాల్లో కూడా పారిశ్రామిక ప్రమాదాలు జరిగినప్పటికీ, ఈ స్థాయిలో ద్రవ ఉక్కు ల్యాడిల్ పేలిన ఘటనలు అరుదుగా నమోదయ్యాయని తెలిపారు.మృతుల కుటుంబాలకు మరో కీలక భరోసా ఇస్తూ, ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలో నివసిస్తున్న కుటుంబాలు ఉద్యోగి పదవీ విరమణ వయస్సు వచ్చే వరకు అదే నివాసంలో కొనసాగవచ్చని చెప్పారు. టౌన్షిప్ వెలుపల అద్దె ఇళ్లలో ఉంటున్న బాధిత కుటుంబాలు కోరుకుంటే వారికి ప్లాంట్ క్వార్టర్లను కేటాయించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు.స్టీల్ ప్లాంట్లో నెలకొన్న కార్మిక సమస్యలు, యాజమాన్య లోపాలు, భద్రతా ప్రమాణాల అమలుపై త్వరలోనే కార్మిక సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్మికుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయమని ఆయన స్పష్టం చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పవన్ కల్యాణ్ విశాఖపట్నంలోని సెవెన్ హిల్స్ హాస్పిటల్ ను సందర్శించి ప్రమాదంలో గాయపడిన కార్మికులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మరోసారి హామీ ఇచ్చారు.



మంగళవారం విశాఖలోని ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న మంత్రి లోకేష్

# బాధితులను పూర్తిగా ఆదుకొంటాం

>> చికిత్స పొందుతోన్న బాధితులను ఆయన మంగళవారం పరామర్శించారు.అనంతరం స్టీల్ ప్లాంట్లో ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.అనంతరం మంత్రి నారా లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించిందన్నారు. ఘటన జరిగిన కొద్ది సేపటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సమాచారం అందించడంతో పాటు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి ప్రకటించిన రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని త్వరితగతిన అందించే చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కారణాలను నిర్ధారించేందుకు నిపుణుల కమిటీ సమగ్ర విచారణ నిర్వహిస్తోందని, కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే తుది నిర్ణయాలు, వ్యాఖ్యలు చేయడం సముచితమని చెప్పారు. ప్రతి ఘటనను ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్నతస్థాయిలో సమీక్షి స్తున్నామని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మరింత బలోపేతం చేసి, గత వైభవాన్ని తిరిగి తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేష్ అన్నారు. ఇప్పటికే కేంద్రం సహకారంతో భారీ ఆర్థిక ప్యాకేజీ, బకాయిల చెల్లింపులు, కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ వంటి చర్యల ద్వారా కర్మాగారం స్థిరీకరణ దిశగా ముందుకు సాగుతోందని వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.ఆర్థిక సహాయం ప్రకటించి చేతులు దులుపుకోవడం మా ఉద్దేశంకాదు. "కేవలం ఆర్థిక సహాయం ప్రకటించి చేతులు దులుపుకోవడం తమ ఉద్దేశం కాదు అని తెలిపారు. బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక భరోసా కల్పించడం, వారి పిల్లల భవిష్యత్తును ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత" అని మంత్రి స్పష్టం చేశారు.ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించేందుకు ముగ్గురు సీనియర్ నిపుణులతో కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించిందన్నారు. కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కార్మికులతో మాట్లాడి, సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. నివేదిక ఆధారంగా భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన కార్మికులను పరామర్శించిన సందర్భంగా, ఒక కార్మికుడు "మమ్మల్ని మాత్రమే కాదు, విశాఖ ఉక్కును కూడా కాపాడండి" అని కోరిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. విశాఖ ఉక్కుపై కార్మికులకు ఉన్న అనుబంధం, భావోద్వేగం తనను కదిలించిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకురావడం, కార్మికుల సంక్షేమాన్ని కాపాడడం, బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ఎన్డీఏ ప్రభుత్వాల బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో కొనసాగుతున్న విభిన్న పరిస్థితులు

**విజయవాడ,జూన్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్దితులు కొనసాగుతున్నాయి.మృగశిర కార్తె వచ్చినా ఎండల తీవ్రత తగ్గడంలేదు. రాష్ట్రమంతటా దాదాపు 40 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. మంగళవారం అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 42.7 డిగ్రీలు, విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 42.4, మన్యం జిల్లా భామినిలో 42.2, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 42, ఏలూరు జిల్లా కక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, కాకినాడ జిల్లా పిఠాపురంలో 41.6, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, విశాఖ జిల్లా అక్కిరెడ్డిపాలెం 41.5 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రేపు అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రజలు తగినజాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పరిస్దితులు రెండు రోజులు కొనసాగవచ్చు నన్నారు. అంచనాల బట్టి బుధవారం అల్లూరి, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు. ఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంబాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ, వాటికి వీలైనంత దూరంగా ఉండాలన్నారు. మరోవైపు విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ..41 42 డిగ్రీల.. మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ..40 41 డిగ్రీల..మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు.

# వామపక్షాలు

>> వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు.

ఈ నిరసన కార్యక్రమంలో వామపక్షాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి రోడ్డుపై బైఠాయించారు. ఆందో ళన కారణంగా జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సంద ర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ. కోట్ల లాభాలు చేకూరుస్తూ, సామాన్య ప్రజలపై మాత్రం మోయలేని భారాలు మోపుతోందని మండిపడ్డారు. పెంచిన ఇంధన ధరలను తగ్గించేంత వరకు తమ ఉద్యమం ఆగేది లేదని స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కూడా దేశంలో ఎక్కడా లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను అదనంగా పెంచేసి ప్రజలను ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమె త్తారు. ప్రజల నడ్డి విరుస్తున్న పాలకులకు పరిపాలించే అర్హతలేదని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, రాష్ట్ర నాయకులు వి. వెంకటేశ్వర్లు, కె. శ్రీదేవి, ఆంధ్ర మాల్యాద్రి, సిపిఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వర రావుతో పాటు సిపిఐ ఎంఎల్ ,ఇతర వామపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గుంటూరు. విజయ నగరం, పల్నాడు,ఏలూరు,శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పెట్రోలు ధరల పెంపుకు నిరసనగా వామపక్షాలు ఆందోళన చేసాయి.

# 'పుష్కర మోడీ'

>> తెచ్చామని, వికసిత్ భారత్ లక్ష్యసాధనలో మరింత ముందుకు పోయేందుకు ప్రజాదీవెనలే మరింత ముందుకు నడిపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్డీయే 12ఏళ్ల పాలన వేడుకలతోపాటు ప్రధాని మోడీ ప్రధానిగా రికార్డుకాలం పూర్తిచేసుకున్నారు. మొత్తం 4399 రోజులు ప్రధానిగా పదవిలోకొనసాగి ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును కూడా అధిగమించారు. జవహర్లాల్నెహ్రూ 1952 మే 13నుంచి 1964 మే 27వరకూ నిరాఘాటంగా పదవిలో కొనసాగి 4398 రోజులు గడిపారు. ఇపుడు ప్రధానిగామోడీ నెహ్రూ రికార్డును కూడా అధిగమించారు. అత్యధికకాలం ప్రధానిగా కొనసాగిన నేతల జాబితాలో మూడోస్థానంలో ఇందిరాగాంధీ నిలిచారు. ఆమె 1966 జనవరి 24నుంచి 1977 మార్చి 24వరకూ వరుసగా 4077 రోజులుపదవిలో ఉన్నారు. అలాగే దేశ చరిత్రలో అత్యధికకాలం పాలన కొనసాగించిన ఎన్నికైన ప్రభుత్వ అధినేతగా కూడా మోడీ రికార్డుసాధించారు. సిక్కిం సీఎంగా పవన్కుమార్ చామ్లింగ్ 8930 రోజులు పనిచేస్తే ప్రధాని మోడీ ఈ ఏడాది మార్చినలోనే ముఖ్యమంత్రి, ప్రధానిగా మొత్తం ఆరికార్డును అధిగమించారు. 2001 నుంచి 2014వరకూ గుజరాత్ సిఎంగా మోడీ పనిచేసిన సంగతి తెలిసిందే. ఇక ఎన్డీయే పాలన వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రధాన పక్షం బిజెపి నిర్ణయించింది. నియోజకవర్గాల్లో ప్రత్యేకకార్యక్రమాలనిర్వహణకు కార్యాచరణ ప్రకటించింది. దేశ రాజధాని ఢిల్లీలోకూడా ప్రధాని మోడీ రికార్డు పాలనతో ఆయన్ను సత్కరించేందుకనిర్ణయించింది. ప్రధానిమోడీ అధ్యక్షతన కేబినెట్సమావేశం కూడా జరుగుతోంది. ఆ భేటీలోనే ప్రధానిని మంత్రివర్గం మొత్తం సత్కరించనున్నది. అలాగే బిజెపి కేంద్ర కార్యాలయంలో కూడా 12 ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అధ్యక్షుడు నితిన్నబీన్సింగ్, జెపినడ్డా, రక్షణ, హోంమంత్రులు రాజ్నాథ్సింగ్, అమిత్షాలతోపాటు ఇతర కేంద్రమంత్రులు, ఎంపిలు పార్టీ సీనియర్లు ఈ వేడుకలకు హాజరుకానున్నారు.

## వారం - వర్జ్యం

10-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
దశమి రా.12.54
ఉత్తరాభాద్ర ఉ.9.18
వర్జ్యం : రా.8.46-రా.10.17
దు. ఉ.11.40-మ.12.32
శుభసమయం: ఉ.8.00-9.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా ధైర్యంతో ముందుకు సాగుతారు.

**వృషభం:** క్రయ విక్రయాలలో ఆచితూచి వ్యవహరించండి. లాభనష్టాలు అనుకూల ప్రతికూల వ్యవహారాలు రెండు సమానంగా ఉంటాయి.

**మిథునం:** కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు ఉంటాయి. వాహనయోగం కలదు.

**సింహం:** సంతాన విద్యావిషయంలో ఎక్కువ ప్రాముఖ్యత కనబరుస్తారు. పేరు ప్రఖ్యాతల కోసం విశేషంగా శ్రమిస్తారు.

**కన్య :** ఋణాలు తీరి ఊరట చెందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైనా ఆటంకాలు తొలగుతాయి. వస్త్రలాభం.

**తుల :** సెంటిమెంట్లు వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. బంధువుల కలయిక.

**వృశ్చికం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆస్తి విషయంలో ఒప్పందాలు కుదురుతాయి. శుభవార్తలు అందుకుంటారు.

**ధనుస్సు:**పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘసేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఆభరణాలుకొనుగోలు.

**మకరం:** దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వివాదాలకు దూరంగా వుండండి. కొత్త పరిచయాలు.

**కుంభం:** ఇళ్ళకు సంబంధించిన నూతన ఒప్పందాలు కుదురుతాయి. వ్యాపారాలలో పట్టుదలతో ముందుకు సాగుతాయి.

**మీనం:** బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు. పరిచయాలు పెరుగుతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రభుత్వ సేవలకు ప్రత్యేక యాప్

>> క్యాంటీన్ల సేవలను ఏ విధంగా అందిస్తున్నారో... రూరల్ ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లల్లోనూ అదే స్థాయిలో సేవలు అందించాలి. ప్రజలకు అందే తాగునీటి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగునీటి కాలుష్యం అనేది ఉండకూడదు. తాగునీటిలో ఎలాంటి మలినాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజూ తాగునీటి శాంపిళ్లు తీయాలి. తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి నిరక్ష్యం చూపొద్దు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. ప్రజల్లో అవగాహన వస్తేనే క్లీన్ అండ్ గ్రీన్ తరహా కార్యక్రమాలను విజయవంతం చేయగలం. ప్రకృతి పట్ల, పరిసరాల శుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన పెంచేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలి. జలధార కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆ కార్యక్రమం ఫలితాలు కన్పించాలి. చెరువులను సిద్ధం చేసుకోవాలి. వర్షాకాలంలో చెరువులన్నీ నిండేలా చూడాలి. వర్షపు నీటిని ఒడిసి పట్టాలి. ప్రతి కుంటనూ, ప్రతి చెరువునూ ఆన్ లైన్లో పెట్టేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించేలా ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షి ంచుకునేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. దీని కోసం టెక్నాలజీని వినియోగించాలి. ఈ మేరకు అనంతపురం జిల్లాలో అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టును పరిశీలించాలి. గంజాయిని అరికట్టేందుకు మూలాల్లోకి వెళ్లాలి. గంజాయి సాగు, రవాణ, అమ్మకం, వినియోగం అనేది ఎక్కడా కన్పించకూడదు. మహిళలపైనేరాలను అరికట్టేలా చర్యలుతీసుకోవాలి... వివిధనేరాలకు పాల్పడితే ఎలాంటి శిక్షలు పడతాయి.. శిక్షలు పడిన వారికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రచారం చేయాలి అన్నారు. ఈ సమీక్షలో మంత్రి కొలుసు పార్ధసారధి, సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**'ఆర్థిక వ్యవహారాలల పర్యవేక్షణకు ఎఐ టాస్క్ఫోర్స్**

ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా డ్రివెన్ గవర్నెన్సుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు, కీపెర్ఫార్మెన్సు ఇండికేటర్లపై సీఎం సమీక్షించారు. క్యాంపు కార్యాలయంలో సమీక్షకు ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన, రవాణా, పర్యాటకశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖలకు పెర్ఫార్మెన్సు ఇండికేటర్లను సిఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగు పరచడం, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవటమే లక్ష్యంగా పని చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు.నిర్దేశించుకున్న లక్ష్యాలతో పాటు రియల్ గ్రోత్ ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాలపై చేసే వ్యయం 3.5 రెట్ల మేర ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించేలా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రియల్ టైమ్లో ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలన్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా డ్రివెన్ గవర్నెన్స్పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు

# పునరుత్పాదక ఇంధనంలో భారత్ టాప్

>> లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు ఆకర్షించామని, ఎలక్ట్రానిక్స్ తయారీ 28 రెట్లు పెరిగిందని, మొబైల్ ఫోన్ ఎగుమతులు 163 రెట్లు వృద్ధిచెంది దేశ ఎగుమతుల్లో కొత్త రికార్డులు సృష్టించాయని వివరించారు. మంగళవారం మధ్యాహ్నం తిరుపతిలో మీడియా ప్రతినిధులతో కేంద్రమంత్రి జోషి మాట్లాడారు. ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో భారత్ చీకటి నుంచి విద్యుత్ మిగులు దేశంగా మారిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల పాలనలో దేశం విద్యుత్ కొరత నుంచి విద్యుత్ మిగులు దేశంగా ఖ్యాతి గడించిందని కేంద్ర మంత్రి జోషి అన్నారు. విశ్వాసానికి, అభివృద్ధికి, జనకళ్యాణానికి 12 సంవత్సరాలు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ విజయాలను వివరించారు.

2014కు ముందు దేశంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 123 గిగావాట్లు ఉన్న సమయంలో ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాలు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడ్డాయని, ఆ తరువాత మోడీ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది మే 23న నమోదైన 280 గిగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ను విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ప్రస్తుతం దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థం 538 గిగావాట్లకు చేరుకోగా, అందులో 33 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే వస్తోందని చెప్పారు. మోదీ ప్రభుత్వం అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరేలా పనిచేస్తోందని పేర్కొన్న ఆయన, అంతర్జాతీయ ద్రవ్య నిధి , ప్రపంచ బ్యాంకు అధ్యయనాల ప్రకారం దేశంలో బహుముఖ పేదరికం 2013-14లో 29.17 శాతం ఉండగా, ప్రస్తుతం 11.28 శాతానికి తగ్గిందన్నారు. ఫలితంగా 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని జోషి తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో ప్రతి రాష్ట్ర అభివృద్ధి కీలకమని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ ప్లాంట్, దక్షిణ తీర రైల్వే జోన్ వంటి ప్రాజెక్టులకు కేంద్రం గణనీయమైన సహాయం అందించిందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

అంతకుముందు విశాఖ స్టీల్ ప్లాంట్లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులకు సంతాపం ప్రకటించిన కేంద్ర మంత్రి, బాధిత కుటుంబాలకు గాయపడిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిడిపి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర హ్యాండ్ క్రాఫ్ట్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బి జె పి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కోలా ఆనంద్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రచురించిన ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వ 12 సంవత్సరాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పుస్తకాలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆవిష్కరించారు.

# ముక్కోణపు సిరీస్‌లో భారత్-ఎ శుభారంభం



తిలక్, రుతురాజ్ సూపర్

**దంబుల్లా:** శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఎ శుభారంభం చేసింది. ఉత్కంఠ భరిత పోరులో అతిథ్య శ్రీలంక-ఎపై 8 పరుగుల స్వల్ప తేడాతో గెలుపొందింది. 49వ ఓవర్‌లో అర్షద్ ఖాన్ అద్భుత బౌలింగ్‌లో శ్రీలంకను కట్టడి చేశాడు. రెండు వికెట్లతో పాటు ఓ రనౌట్‌తో గెలుపును భారత్ వైపు మరల్చాడు. ఒత్తిడిలోనూ అద్భుత లైన్ లండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసిన అర్షద్ కేవలం ఒక పరుగు మాత్రమే ఇచ్చాడు.

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఎ ఆరంభంలో తడబడింది. స్టార్టింగ్‌లో వరుసగా బౌండరీలు బాదుతూ ఊపుమీద కనిపించిన వైభవ్.. కేవలం 12 బంతుల్లో 14 రన్స్ మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(2) కూడా నిరాశపరచడంతో భారత్-ఎ 16 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ప్రియాన్స్ ఆర్య(32 బంతుల్లో 32) క్రీజ్‌లో ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. బంతికో పరుగు చొప్పు 32 రన్స్ చేశాడు. కానీ దురదృష్టవశాత్తూ 13వ ఓవర్ వద్ద రనౌట్ కావడంతో భారత్ 69 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

**కెప్టెన్ తిలక్, రుతురాజ్ క్లాస్**

ఈ దశలో రుతురాజ్ గైక్వాడ్(114 బంతుల్లో 101; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కెప్టెన్ తిలక్ వర్మ(97 బంతుల్లో 60; 2 ఫోర్లు, ఓ సిక్స్) జతకూడిన తర్వాత ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకున్నారు. పిచ్ కండిషన్స్ అర్థం చేసుకుంటూ మొదట్లో కాస్త నెమ్మదిగా బ్యాటింగ్ స్టార్ట్ చేసిన రుతురాజ్.. ఆ తర్వాత కెప్టెన్ తిలక్ వర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను బిల్డ్ చేశాడు. స్కోరును చూస్తుండగానే 100, 150, 200 దాటించారు. శ్రీలంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ రుతురాజ్ సెంచరీ పూర్తి చేశాడు. నాలుగో వికెట్‌కు 150 పరుగుల భారీ భాగస్వామ్యం అందించి అవుటయ్యాడు. కాసేపటికే అద్భుతమైన హాఫ్ సెంచరీతో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మ కూడా మొహమ్మద్ షిరాజ్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయి వెనుదిరిగాడు.

**స్లాగ్ ఓవర్లలో సూర్యాంశ్, బదోనీ మెరుపులు**

స్లాగ్ ఓవర్లలో ఆయూష్ బదోనీ(18 బంతుల్లో 24), సూర్యాంశ్ షెడ్జ్(14 బంతుల్లో 26) లంక బౌలర్లపై బ్యాట్ ఝులిపించారు. ఈ ఇద్దరూ వేగంగా ఆడుతూ స్కోరు బోర్డును పరిగెత్తించారు. దీంతో భారత్-ఎ నిర్ణీత 50 ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్లు కోల్పోయి 277 పరుగులు చేసింది.

**ఆరంభంలో లంకేయుల అదుర్స్**

278పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన శ్రీలంక-ఏ48.5ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అవిష్క ఫెర్నాండో(45), ఫస్ట్ డౌన్ సదీర సమరవిక్రమ(46) రాణించారు. కెప్టెన్ సహన్ అరాచ్చిగే(72 బంతుల్లో 74) ధాటిగా ఆడుతూ లంకకు గెలుపు ఆశలు కలిగించారు. ఈ దశలో కంబోజ్ అద్భుత బంతితో సహన్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి చేయడంతో లంక మిడిలార్డర్ పూర్తిగా చేతులెత్తేసింది. వనుజా సహన్ మెరుపులతో లంక విజయానికి చేరువయింది.

చివరి రెండు ఓవర్లలో పది పరుగులు చేయాల్సిన దశలో అర్షద్ ఖాన్ మ్యాచ్ స్వరూపాన్నే పూర్తిగా మార్చేశాడు. ఒత్తిడిలోనూ అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసిన అర్షద్.. ఆ ఓవర్లో కేవలం ఒక్కటంటే ఒక్క పరుగు మాత్రమే ఇచ్చి.. 2 కీలక వికెట్లు పడగొట్టడంతో పాటు ఒక రనౌట్ చేసి లంక పతనాన్ని శాసించాడు. దీంతో భారత్-ఎ జట్టు 8 పరుగుల తేడాతో సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది.

# 24 యేళ్ల నిరీక్షణకు తెరపడేనా?

**హాట్ ఫేవరెట్లలో ఒకటిగా బ్రెజిల్ *గ్రూప్-సిలో గట్టి పోటీ *ప్రమాదకర జట్టుగా మొరాకో**

*ప్రపంచం మొత్తం ఎదురుచూస్తున్న మెగా ఈవెంట్ రానే వచ్చింది. రేపటి నుంచి సాకర్ ప్రపంచకప్ ఆరంభం కానుంది. ఆడుతున్నది 48 జట్లే అయినా... మిలియన్ల మంది చూపంతా దీనిపైనే. జూలై 19 వరకు ఈ సాకర్ సంబరం ఫుట్‌బాల్ అభిమానులను ఉర్రూతలూగించనుంది. ఫిఫా ప్రపంచకప్‌లో పలు మేటి జట్లున్నా అందరి చూపు సాంబా టీమ్‌పైనే.అత్యధికంగా 5సార్లు సాకర్ ప్రపంచకప్‌ను బ్రెజిల్ అందుకుంది. చివరిసారి 2002లో ప్రపంచకప్ విజేతగా నిలిచింది. దాదాపు 24 ఏళ్లుగా బ్రెజిల్ ను ట్రోఫీ ఊరిస్తోంది. ఈసారి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలని సాంబా టీమ్ ఫోకస్ పెట్టింది.*



(వార్త క్రీడా విభాగం)

ఫిఫా ప్రపంచకప్ గ్రూప్-సిలో బ్రెజిల్ జట్టు పోటీపడుతోంది. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఆసక్తికర గ్రూపుల్లో ఇది ఒకటి. అయిదుసార్లు ఛాంపియన్ బ్రెజిల్ ఇందులో ఉండడమేకారణం. గ్రూప్-సిలోని మిగతా జట్లు మొరాకో, హైతి, స్కాట్లాండ్. 2022లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన మొరాకోను తక్కువ అంచనా వేయలేం. కూనలు స్కాట్లాండ్, హైతి కూడా తమదైన రోజున సంచలనాలు సృష్టించగలవు.

ఫిఫా ర్యాంకింగ్స్ ఆరో స్థానంలో ఉన్న బ్రెజిల్.. గ్రూపులో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నది. అయితే ఈసారి ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో బ్రెజిల్ కష్టపడాల్సి వచ్చింది. మెగా టోర్నీకి అర్హత సాధిస్తుందా లేదా అన్న అనుమానాల నేపథ్యంలో.. కోచ్ మార్పు ఆ జట్టుకు ఎంతో మేలు చేసింది. కార్లో అన్సెలోటి బాధ్యతలు స్వీకరించాక.. ఆఖరి నాలుగు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో మూడు గెలిచిన బ్రెజిల్ ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది. జట్టు ప్రపంచకప్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేస్తుందని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.

**స్టార్ అట్రాక్షన్‌గా నెయ్‌మార్**

మార్కినోస్ సారథ్యంలోని బ్రెజిల్ గ్రూపులో అగ్రస్థానంలో నిలిచేఅవకాశాలు మెండుగా ఉన్నాయి. బలమైన జట్టుగా ఎదిగిన మొరాకో నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది. హైతి, స్కాట్లాండ్‌ల నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురు కాకపోవచ్చు. అయితే టోర్నీ ముంగిట స్టార్ ఆటగాడు నెయ్‌మార్ గాయపడడం ఆ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే. తొలి కొన్ని మ్యాచ్‌లకు నెయ్‌మార్ అందుబాటులో ఉండడం లేదు. అయినా బ్రెజిల్ యువ ఆటగాళ్లతో కళకళలాడుతోంది. విన్సియస్ జూనియర్, మార్కినోస్, నెయ్‌మార్, రాఫినా, ఎండ్రిక్, మార్టినెలిబ్రెజిల్ జట్టులో కీలక ఆటగాళ్లు. ప్రస్తుత ప్రపంచకప్‌లో సాంబా జట్టు ఎక్కువ మంది యువ ఆటగాళ్లతో బరిలో దిగుతున్నా.. అభిమానుల ఆశలు మాత్రం వెటరన్ స్టార్ నెయ్‌మార్‌పైనే ఉన్నాయి.

**మొరాకో నుంచి అసలు పోటీ**

మొరాకో ప్రమాదకర జట్టుగా ఎదిగింది. 2018 వరకు నాలుగుసార్లు మాత్రమే ప్రపంచకప్‌నకు అర్హత సాధించిన మొరాకో... 2022లో అంచనాలను తలకిందులు చేస్తూ సంచలన ప్రదర్శనతో ఆశ్చర్యంలో ముంచెత్తింది. క్వార్టర్‌ఫైనల్లో బలమైన పోర్చుగల్‌కు షాకిస్తూ.. సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఫిఫా ప్రపంచకప్‌లో సెమీస్ చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా చరిత్ర సృష్టించింది. ఈసారి కూడా క్వాలిఫికేషన్‌లో మెరుగైన ప్రదర్శన చేసి, గ్రూప్ విజేతగా నిలిచిన మొరాకోపై మంచి అంచనాలే ఉన్నాయి. మొరాకో జట్టులో అష్రాఫ్ హాకిమి, బ్రహీమ్ దియాజ్, సోఫ్యాన్ అమ్రాబాత్ కీలక ఆటగాళ్లుగా ఉన్నారు.

## ఐర్లాండ్, ఇంగ్లండ్ టీ20లకు టీమిండియాలో కీలక మార్పు

# సిరాజ్ ఔట్, ప్రసిద్ధ్ కృష్ణ ఇన్





**ముంబై:** ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్ కోసం ప్రకటించిన టీమిండియా జట్టులో కీలక మార్పు జరిగింది. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మహ్మద్ సిరాజ్‌కు విశ్రాంతి కల్పించింది. అతని స్థానంలో టీ20లకు ప్రసిద్ధ్ కృష్ణను ఎంపిక చేసింది. సుదీర్ఘ అంతర్జాతీయ సీజన్ ముందున్న నేపథ్యంలో సిరాజ్‌పై వర్క్‌లోడ్ తగ్గించేందుకు అతనికి విశ్రాంతి కల్పించినట్లు బీసీసీఐ వెల్లడించింది. రెండు సిరీస్‌లకు సిరాజ్ స్థానంలో ప్రసిద్ధ్ కృష్ణ ఆడనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వైస్ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించనున్నారు.యువఆటగాళ్లకు అవకాశం దక్కింది.


**షెడ్యూల్ విడుదల**

ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ కూడా విడుదలైంది. జూన్ 26న ఐర్లాండ్‌తో మొదటి టీ20 మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత జూన్ 28న రెండో టీ20 మ్యాచ్ జరగనుంది. ఐర్లాండ్ పర్యటన ముగిసిన వెంటనే జూలై 1 నుంచి ఇంగ్లాండ్‌తో అసలైన సిరీస్ ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో భాగంగా ఇంగ్లాండ్ జట్టుతో టీమిండియా ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనుంది.

**భారత పూర్తి జట్టు**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ.

# ఆసీస్ ఓపెన్ టైటిల్‌పై సింధూ ఫోకస్



**సిడ్నీ:** ఈ సీజన్లో అయిదు నెలలు పూర్తయినా భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధూ టైటిల్ సాధించడంలో విఫలమవుతోంది. సింగపూర్, థాయ్‌లాండ్ ఓపెన్లలో క్వార్టర్స్‌లో ఓడిన సింధు.. ఇండోనేసియా ఓపెన్లో రెండో రౌండ్లో ఇంటిముఖం పట్టింది. దీంతో మంగళవారం ప్రారంభమైన ఆసీస్ ఓపెన్లో మరోసారి టైటిల్ కోసం సింధు బరిలో దిగుతోంది.

ఈ టోర్నీలో ఆమె ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో లూసియా కాస్టిల్లో (పెరూ)తో సింధూ తలపడనుంది. మరో తొలి రౌండ్ పోరులో హాన్ గ్జియాన్ (చైనా)తో ఇషారాణి బారువా పోటీపడనుంది. చియాన్ (చైనీస్ తైపీ)తో తన్వి శర్మ.. ఒకుహర (జపాన్)తో అన్మోల్.. వాంగ్ లింగ్ (మలేసియా)తో ఆకర్షి కశ్యప్ పోటీపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో మో జాకీ (ఇండోనేసియా)తో ప్రణయ్, జస్టిన్ హో (మలేసియా)తో కిరణ్ జార్జ్ తొలి రౌండ్ మ్యాచ్‌లు ఆడతారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్ అర్జున్, అచ్యుతాదిత్య రావుఅర్జున్ రెడ్డి, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో జోడీ ఈ టోర్నీలో తలపడతాయి.

# ఒత్తిడిలోనే పసిడి, వెండి ఫ్యూచర్లు

## స్పాట్‌గోల్డ్ ఔన్స్‌కు 4300 డాలర్లు



**న్యూఢిల్లీ,జూన్ 9:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించే అవకాశాలను పెంచుతున్న నేపథ్యంలో సమీప కాలంలో బంగారం ధరలు ఒత్తిడిలోనే కొనసాగే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ అంచనావేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో పశ్చిమ ఆసియాలో భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గినప్పటికీ, పెట్టుబడిదారులు ఇప్పుడు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు మరియు ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశంపై దృష్టి సారించారు. మంగళవారం స్పాట్ గోల్డ్ ఔన్సుకు 4,300 డాలర్లకు పైగా స్థిరంగా కొనసాగింది. ముడి చమురు ధరలు తగ్గడం, ఇంధన ఆధారిత ద్రవ్యోల్బణ ఆందోళనలు సడలడం బంగారానికి మద్దతు ఇచ్చాయి. అమెరికా కార్మిక మార్కెట్ బలంగా ఉండటంతో డాలర్ మరియు ట్రెజరీ బాండ్ యీల్డ్స్ పెరిగాయి. ఫెడ్ వడ్డీ రేట్లను ఎక్కువ కాలం ఉన్నత స్థాయిలో కొనసాగించే అవకాశాలపై అంచనాలు బలపడ్డాయి. ప్రస్తుతం మార్కెట్లు డిసెంబర్‌లో వడ్డీ రేటు పెంపుకు సుమారు 70 శాతం అవకాశాన్ని అంచనా వేస్తున్నాయి.కోటక్ సెక్యూరిటీస్ ప్రకారం, ఎంసీఎక్స్ గోల్డ్ ఆగస్టు ఫ్యూచర్స్‌కు రూ.1,53,649 వద్ద కీలక మద్దతు ఉంది. ఈ స్థాయి కంటే దిగువకు పడితే ధరలు రూ.1,53,092 వరకు, ఆ తర్వాత రూ.1,51,290 వరకు తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, పైస్థాయిలో రూ.1,55,451 వద్ద ప్రతిఘటన ఉండగా,తదుపరి ప్రతిఘటన స్థాయిలు రూ.1,56,008 మరియు రూ.1,57,810గా ఉన్నాయి. స్పాట్ గోల్డ్‌కు ఔన్సుకు 4,296.5 డాలర్లు, 4,274.8 డాలర్లు, 4,204.8 డాలర్ల వద్ద మద్దతు ఉండగా, 4,366.5 డాలర్లు, 4,388.2 డాలర్లు, 4,458.2 డాలర్ల వద్ద ప్రతిఘటన కనిపిస్తుందని తెలిపింది. వెండి ధరలు మెరుగైన మార్కెట్ సెంటిమెంట్ కారణంగా ఔన్సుకు 68 డాలర్లకు పైగా చేరాయి. మద్దతు స్థాయిలు బలహీనపడితే వెండి ధరలు కూడా ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ హెచ్చరించింది. స్పాట్ సిల్వర్‌కు 67.18 డాలర్లు, 66.43 డాలర్లు, 64.01 డాలర్ల వద్ద మద్దతు ఉండగా, 69.60 డాలర్లు, 70.35 డాలర్లు, 72.77 డాలర్ల వద్ద ప్రతిఘటన ఉండొచ్చనిఅంచనావేసింది. ఎంసీఎక్స్ సిల్వర్ జూలై ఫ్యూచర్స్‌కు రూ.2,42,937, రూ.2,40,928, రూ.2,34,422 వద్ద మద్దతు స్థాయిలు ఉండగా, రూ.2,49,442, రూ.2,51,452, రూ.2,57,958 వద్ద ప్రతిఘటన స్థాయిలున్నట్లు అంచనావేసింది.

## ధరల పెంపుతోనే ఆయిల్ కంపెనీలకు నష్టాల రికవరీ

**న్యూఢిల్లీ, జూన్ 9:**పశ్చిమాసియా యుద్ధంతో ఏర్పడిన ఇంధన కొరత వల్ల చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఈ 78 రోజుల్లో ఎదురయిన రూ.1.23 లక్షలకోట్ల భర్తీకోసం కేంద్రం పెట్రోలు,డీజిల్‌పై సుంకాలను రద్దుచేసింది. కస్టమర్లపై ఎక్కువ భారం పడకుండా ముందు ఆయిల్‌కంపెనీలకు ఈ సుంకాల రద్దుతో కొంతమేర నష్టం రికవరీచేసిందనినిపుణులు పేర్కొంటున్నారు. గతనెల చివరినాటి వరకూ ఉన్న డేటానుచూస్తే ఆయిల్‌మార్కెటింగ్ కంపెనీలు రోజుకు రూ.600 కోట్లమేర నష్టం భరిస్తున్నట్లు తేలింది. నాలుగుసార్లు పెట్రోలు, డీజిల్‌ధరలు పెంచడంవల్ల ఈ నష్టం కొంతమేర భర్తీ అయిందని తెలుస్తోంది. పెట్రోడీజిల్ ధరలను పెంచడంవల్లనే ఎదురవుతున్న రూ.1.23లక్షల కోట్లనష్టాన్ని భర్తీచేయగలిగామని పెట్రోలియం కార్యదర్శి సుజాత శర్మ అన్నారు. ఇంధన ధరలు పెంపునకు ముందు రోజుకు రూ.1000 కోట్లు నష్టం ఓఎంసిలు ఎదుర్కొన్నట్లు తేలింది. మేచివరివారంలోనే ఇంధన ధరలను లీటరుకు రూ.2.7 చొప్పున పెంచింది. ఈచర్య మార్కెటింగ్‌కంపెనీల నష్టాలను 44శాతం మేర తగ్గించగలిగింది. నాలుగుదశలుగా మే 15,19,23,25 తేదీల్లో పెట్రోలు డీజిల్‌లపై ధరలు పెంచారు.హర్ముజ్‌లో సమస్యలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నా భారత్ ఇంధన సరఫరాకు ఎలాంటి ఇబ్బందులువేలని సుజాత శర్మ వెల్లడించారు. ఫిబ్రవరి8 నుంచి ప్రారంభం అయిన పశ్చిమాసియా ఉద్రిక్తతలవల్ల భారత్‌లో వివిధ రంగాలపై ప్రభావం పడిందన్నారు. అయితేప్రభుత్వ చర్యలవల్ల నష్టాల భారం రోజుకు రూ.750క ఓట్లకు తగ్గాయని అన్నారు. ఇక గ్యాస్‌సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరాఘాటంగా పెంచాలని ఆయిల్‌కంపెనీలకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

# టెక్నాలజీ,బ్యాంకింగ్ షేర్ల మద్దతు

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబై, జూన్ 9:** అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరల తగ్గుదల, బ్యాంకింగ్ షేర్లలో బలమైన కొనుగోళ్లతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం తిరిగి లాభాల బాట పట్టాయి.ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 93 డాలర్ల దిగువకు చేరింది. దీంతో ద్రవ్యోల్బణం, భారత దిగుమతి వ్యయాలపై ఉన్న ఆందోళనలు తగ్గాయి.ప్రపంచ మార్కెట్లలో టెక్నాలజీ షేర్లు కోలుకోవడంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ మెరుగుపడింది. మరోవైపు, విదేశీ కరెన్సీ నిధుల సమీకరణకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫారెక్స్ స్వాప్ కార్యాచరణ బ్యాంకింగ్ రంగానికి ఊతమివ్వడంతోబ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి.

రోజంతా లాభాల్లో ట్రేడైన మార్కెట్లో సెన్సెక్స్ 394.50 పాయింట్లు పెరిగి 73,918.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 119.10 పాయింట్లు లాభపడి 23,242.10 వద్ద స్థిరపడింది. గత రెండు సెషన్లలో నిఫ్టీ 1.25 శాతం క్షీణించింది. నిఫ్టీ పెరుగుదలకు ప్రధానంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.11, ఐసీఐసీఐ బ్యాంక్ 1.98, యాక్సిస్ బ్యాంక్ 1.92 షేర్లు మద్దతు ఇచ్చాయి.బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.24 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.39 శాతం చొప్పున పెరిగాయి. బీఎస్ఈలో 2,782 షేర్లు లాభపడగా, 1,423 షేర్లు నష్టపోయాయి. 207 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది. రూపాయి విలువ డాలర్‌కు 95.41 వద్ద ట్రేడైంది.ఎంసీఎక్స్‌లో ఆగస్టు 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధరలు 0.01 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,54,789కు చేరాయి. అమెరికా 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 4.558 శాతానికి చేరింది.బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1.74 డాలర్లు లేదా 1.85 శాతం తగ్గి 92.51 డాలర్లకు చేరింది.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు 5.25 పెరిగిది. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ కంపెనీలో 0.30 వాటా కొనుగోలు చేసింది. యాపిల్ ఐఒఎస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు ప్రకటించడంతో రెడింగ్టన్ షేరు 4.69 పెరిగింది.ఆయే ఫైనాన్స్ 15మిలియన్ డాలర్ల వరకు ఎన్సీడీల ద్వారా నిధుల సమీకరణకు అనుమతి ఇవ్వడంతో షేరు 8.68 ఎగిసింది. జేఎన్‌కే ఇండియా యూఏఈ సంస్థ నుంచి రూ.100300 కోట్ల మధ్య విలువైన భారీ ఆర్డర్ పొందడంతో 15.70 లాభపడింది.


గ్రాసిమ్ ఇండస్ట్రీస్ కర్ణాటకలో లయోసెల్ ఫైబర్ సామర్థ్య విస్తరణకు రూ.3,094 కోట్ల పెట్టుబడి ప్రకటించడంతో 1.49పెరిగింది. అవాంటెల్‌కు డీఆర్డీవో నుంచి రూ.9.94 కోట్ల ఆర్డర్ లభించడంతో 4.35 పెరిగింది.

వీఏ టెక్ వాబాగ్ యూఏఈలో అజ్మాన్ సెవేజ్ బయోరిఫైనరీ ప్రాజెక్టు కాంట్రాక్టు దక్కించుకోవడంతో 2.72లాభపడింది. హెక్సాగన్ న్యూట్రిషన్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. జూన్ 9 సాయంత్రం 4:25 గంటల వరకు ఈ ఇష్యూకు 52.89 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. మొత్తం 2.16 కోట్ల షేర్లకు గాను 114.24 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. షేరు ధర బ్యాండ్‌ను రూ.4245 మధ్య నిర్ణయించారు.

## భారత్ ఆర్థికవృద్ధి 6.4శాతం మాత్రమే: ఫిట్చ్ రేటింగ్స్

**ముంబయి,జూన్ 9:** అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ ఫిట్చ్ రేటింగ్స్ భారత్ జిడిపి వృద్ధిరేటును తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.7 నుంచి 6.4శాతంగా మాత్రమే ఉంటుందని తెలిపింది.అమెరికా ఇరాన్ యుద్ధం ఆర్థికవ్యవస్థను కొంత మేర ఒత్తిడికి గురిచేసిందని, సెప్టెంబరు, డిసెంబరు త్రైమాసికాల్లో ఆర్థికవృద్ధి మందగమనంతో ఉందని ఫిట్చ్ వెల్లడించింది. 2027 ఆర్థికసంవత్సరంలో కూడా 7.4శాతంనుంచి తగ్గుతుందని అంచనావేసింది.ధరల పెరుగుదల,వాస్తవరాబడుల్లో కోత, వినియోగదారుల వ్యయంలో క్షీణత వంటివి కొంతకారణం అయ్యాయి. జిడిపి వృద్ధి 2027లో 6.4శాతంగా మాత్రమే ఉంటుందని ఫిట్చ్ అంచనావేసింది. దేశీయ డిమాండ్ ఒక్కటే వృద్ధికి ఆస్కారంగా నిలిచింది. దిగుమతులు తగ్గినట్లయితే ఆర్థికవృద్ధి పెరుగుదలకు కొంత దోహదంచేసినట్లవుతుంది. బాహ్య డిమాండ్‌నుంచి వచ్చే వృద్ధికూడా కొంతమేర జిడిపికి కీలకం అవుతుందని ఫిట్చ్ రేటింగ్స్ తన జూన్ గ్లోబల్ ఎకనమిక్ ఔట్‌లుక్‌లో వెల్లడించింది.గతవారంలో ఆర్‌బిఐ కూడా భారత్ వృద్ధిరేటును ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.6శాతంగ ఆమాత్రమే ఉంటుందని వెల్లడించింది. ద్రవ్యోల్బణం కూడా 5.1శాతంగా పెరుగుతుందని తెలిపిన సంగతి తెలిసిందే.కేవలం పశ్చిమాసియా ఉద్రిక్తతలవల్లనే ఇంధన ధరలు ఇటీవలి కాలంలో 4నుంచి 5శాతంవరకూ పెరిగాయని,దీనివల్ల ధరల పెరుగుదల ఆర్థిక వృద్ధికి బ్రేకులు వేసినట్లు అభిప్రాయపడింది.వినియోగ వ్యయం పెరిగితే, ఇంధన ధరలు కొంతమేర సద్దుమణిగిన పక్షంలో పెట్టుబడులు పెరిగి వృద్ధిరేటు6.7శాతంగా ఉంటుందని అంచనావేసింది. 2029 ఆర్థికసంవత్సరానికి మాత్రం 6.4శాతం వృద్ధి ఉండవచ్చని కూడా ఫిట్చ్ రేటింగ్స్ ప్రకటించింది.


## రూపాయి స్థిరీకరణ చర్యలతో 65 బిలియన్ డాలర్ల రాక



**ముంబయి,జూన్9:**రిజర్వుబ్యాంకు ఇటీవలికాలంలో రూపాయి కట్టడికి చేపట్టిన కార్యాచరణ కారణంగా భారత్‌కు 55నుంచి 65 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశాలు పెరిగాయని తెలుస్తోంది. రూపాయి స్థిరీకరణతోపాటు దేశ చెల్లింపుల సమతుల్యతను మిగులులోకి తీసుకురావడంద్వారా పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నదని ఎస్‌బిఐ రీసెర్చి నివేదిక ఉటంకించింది. ఆర్బీఐ సమన్వయంతో చేపట్టిన కార్యా చరణతో రూపాయి స్థిరపడిందని, డెట్‌మార్కెట్‌కు ఊతం ఇచ్చిందని, విదేశీ మూలధన వనరులు స్థిరంగా సమకూరేవిధంగా ఆర్బీఐ చర్యలు ఉన్నాయని ఎస్బీఐ ఎకోరాప్ నివేదికలో ఉటంకించింది. చూన్‌నెల మానిటరీ పాలసీ సమీక్షను చూస్తే ఆర్బీఐ విదేశీ మూలధన వనరులు సమీకరించడానికి అనేక చర్యలు చేపట్టింది. పెట్టుబడులపరిమితులను పెంచింది. దీనివల్ల దేశ బ్యాలెన్స్‌ఆఫ్ పేమెంట్స్ పటిష్టం అయినట్లు ఎస్‌బిఐ నివేదికలో ప్రస్తావించింది. రాయితీలతోకూడిన ఫోరెక్స్ స్వాప్‌వల్ల విదేశీ వాణిజ్య రుణాలకు ప్రోత్సాహకాలు కూడా ఇచ్చినట్లయింది. బ్యాంకులు కూడా మూడు, ఐదేళ్లకాలానికి ఎఫ్‌సిఎన్‌ఆర్ బి డిపాజిట్లుసేకరించుకునేందుకు వెసులుబాటు ఇచ్చింది. 55నుంచి 65బిలియన్‌డాలర్ల రాకవల్ల 2027 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ వ్యవస్థలోకి డిపాజిట్ల వృద్ధి మరింత పెరుగుతుందనిఎకోరాప్ నివేదికలో ప్రస్తావించింది. 14.5 నుంచి 15వాతం వరకూ డిపాజిట్ల వృద్ధి ఉంటుంది.

## ఒక్కరోజులోనే ఈక్విటీలనుంచి

# 4566.03 కోట్ల ఎఫ్‌పిఐలు వెనక్కి!



**ముంబై, జూన్ 9:** భారతీయ ఈక్విటీ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు వరుసగా పదో ట్రేడింగ్ రోజున పెట్టుబడులు విత్‌డ్రాచేసుకున్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రభుత్వ సెక్యూరిటీల పెట్టుబడి పరిమితులపై సడలింపులు ప్రకటించినప్పటికీ, మంగళవారం ఒక్కరోజే ఎఫ్‌పీఐలు రూ.4,566.03 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.ఇక దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు మాత్రం కొనుగోళ్లను కొనసాగిస్తూ రూ.6,159.48 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. జూన్ నెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు రూ.56,384 కోట్ల మేర నికరంగా పెట్టుబడులను ఉపసంహరించుకోగా, 2026 సంవత్సరంలో మొత్తం విక్రయాల విలువ రూ.2.81 లక్షల కోట్లకు చేరింది.2026లో ఫిబ్రవరి నెల మినహా ప్రతి నెలలోనూ ఎఫ్‌పీఐలు భారతీయ షేర్లను నికరంగా విక్రయించారు. జనవరిలో రూ.35,962 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, ఫిబ్రవరిలో అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటంతో రూ.22,615 కోట్ల పెట్టుబడులు పెట్టారు. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ మార్కెట్లలో రిస్క్ పెరగడంతో ఎఫ్‌పీఐలు మళ్లీ విక్రయాల బాట పట్టారు. మార్చిలో రికార్డు స్థాయిలో రూ.1.18 లక్షల కోట్ల ఈక్విటీలను విక్రయించగా, ఏప్రిల్‌లో రూ.60,847 కోట్ల మేర వాటాలను అమ్మేశారు.ఇదిలా ఉండగా, భారతీయ రిజర్వ్ బ్యాంక్ 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారుల ప్రభుత్వ సెక్యూరిటీలు మరియు రాష్ట్ర అభివృద్ధి రుణపత్రాల్లో పెట్టుబడి పరిమితులను ఇటీవల ప్రకటించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at E-30 & 31, A.K. Nagar, Industrial Estate, Nellore-524004. Ph: 2348108.Fax:2348106, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2003/10109